


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 3 సంచిక: 341, పేజీలు - 08

గురువారం, మార్చి 28, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

### - షాక్ ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మరో షాక్ తగిలింది. ఇప్పటికే అరెస్ట్ అయి ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ పెట్టుకున్న పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ క్రమంలోనే తనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయాలని కేజ్రీవాల్ పెట్టుకున్న అభ్యర్థనను హైకోర్టు నిరాకరించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టులో నిరాశే ఎదురైంది. తాత్కాలిక బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. మరోవైపు కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీకి కోర్టు నోటీసులు జారీ

6లో ▶

## హరీష్‌పై కాంగ్రెస్ ఔదార్యం

### - వ్యూహమేనా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో అధికారం మారిన వెంటనే రాజకీయాలు పూర్తి స్థాయిలో మారిపోయింది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ కుటుంబం అనేక ఇబ్బందులు పడుతోంది. ఇప్పటికే కవిత అరెస్ట్ అయ్యారు. కేసీఆర్, కేటీఆర్ పై రకరకాల ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. తాజాగా సంతోష్ రావుపైనా కేసు నమోదు అయింది. కేసీఆర్ మరో సమీప బంధువు కల్వకుంట్ల కన్నారావు పోలీసుల నోటీసులకు స్పందించడం లేదు. అయితే కేసీఆర్ కుటుంబంలో ఒక్క హరీష్ రావుపై మాత్రం చిన్న ఆరోపణ కూడా రావడం లేదు. ఇది తెలంగాణ రాజకీయ వర్గాలను సైతం ఆశ్చర్య పరుస్తోంది. హరీష్ రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఔదార్యం చూపిస్తోందా.?

**కేసీఆర్ కుటుంబంపై వరుసగా లెక్కలేనన్ని ఆరోపణలు**

బీఆరెస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం వరుస కేసులు, విచారణలతో విలవిలలాడుతున్నది. ఒక రకంగా కేసులు, విచారణల పద్మవ్యూహంలో చిక్కుకుంది. ఒకవైపు ఈ కేసులతో పాటు పార్టీ నుంచి వలసలతో కేసీఆర్ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కేసీఆర్ కుమార్తె కవితను ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ అరెస్టు చేసింది. ఆమెను ఢిల్లీ లిక్కర్ స్కాంలో అత్యంత కీలక పాత్రధారిగా చూపిస్తున్నారు. ఆ హడావుడిలో ఉండగానే కేసీఆర్ అన్న కుమారుడైన కల్వకుంట్ల కన్నారావును పోలీసులు ఓ భూ వివాదంలో లుకౌట్ నోటీసులు జారీ చేశారు. బీఆరెస్ మాజీ ఎంపీ, కేసీఆర్ సమీప బంధువు జోగినపల్లి సంతోష్‌కుమార్‌పై భూ కబ్జా కేసు నమోదైంది. మరోవైపు లిక్కర్ పాలసీ కేసులో కవిత భర్త అనిల్‌ను కూడా అరెస్టు చేసే అవకాశం ఉన్నదన్న చర్చ నడుస్తున్నది. ఆయన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇక కేసీఆర్, కేటీఆర్ లపై కేసులంటూ జరుగుతున్న ప్రచారానికి అడ్డూ అదుపూ ఉండటం లేదు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణతో పాటు రిటైర్డ్ జడ్జితో జ్యుడిషియల్ విచారణకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి తోడు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథార్టీ సైతం విచారణ చేస్తున్నది.

**అత్యంత తీవ్రంగా ఫోన్ ట్యాపింగ్ కేసు**

విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాల వివాదాలపై కూడా విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఫార్ములా

6లో ▶

## దానం నాగేందర్‌పై హైకోర్టులో మరో పిటిషన్

- డిస్‌క్వాలిఫై చేయాలని విజ్ఞప్తి
- ఎంపీ ఎన్నికల వేళ షాక్ తప్పదా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్ ఎన్నికల వేళ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు షాక్ తగిలేలా ఉంది. దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆయనపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలంటూ నగరానికి చెందిన రాజు యాదవ్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలుపొందిన దానం నాగేందర్ ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరటంతో పాటు ఆ పార్టీ తరపున సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారని చెప్పారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తన పదవికి రాజీనామా

6లో ▶

## జగన్ యుద్ధ భేరీ, తోడుగా తల్లి విజయమ్మ

- ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్
- ప్రొద్దుటూరులో తొలి సభ - తనను ఓడించేందుకు అందరూ కలిశారని వెల్లడి
- హంతకులకు మద్దతిస్తూ వస్తున్నారని వ్యాఖ్య
- నా చెల్లెళ్లను నాపై యుద్ధానికి తెస్తున్నారు
- తాను ప్రజలే అండగా ఎన్నికల బరిలో దిగుతున్నానని వ్యాఖ్యలు
- బాబాయి వివేకాను చంపింది ఎవరో అందరికీ తెలుసని స్పష్టీకరణ

6లో ▶





ఏపీ ముఖ్యమంత్రి, వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మేమంతా సిద్ధం పేరిట చేపడుతున్న ఈ ఎన్నికల ప్రచారంలో తొలి సభను ప్రొద్దుటూరులో నిర్వహించారు. ఈ సభలో ఆయన ప్రసంగిస్తూ, ఇంత పెద్ద మీటింగ్ ఈ జిల్లాలో ఎప్పుడూ జరిగి ఉండదేమో అనేలా జన సంద్రం కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు నా విజయాలకు కారణమైన మీ అందరికీ కృతజ్ఞతలు అంటూ ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో తెగని టిక్కెట్ల పంచాయతీ

- ఢిల్లీకి రేవంత్, భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పెండింగ్‌లో ఉన్న సీట్లను ప్రకటించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తోంది. తెలంగాణలో 17 నియోజకవర్గాలకుగాను ఇప్పటికి 9 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. ఇక మిగిలిన ఎనిమిది మందిని ఎంపిక చేయాల్సి ఉంది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. పెండింగ్‌లో ఉన్న 8 సీట్లలో మెదక్, భువనగిరి, వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్ నియోజకవర్గాల అభ్యర్థులు ఉన్నారు.

**- పోటీ తీవ్రంగా ఉండడటంతో హైకమాండ్ దే తుది నిర్ణయం**

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశమైంది. ఎవరెవరికి టికెట్లు ఇవ్వాలనేదానిపై దాదాపుగా ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఆదిలాబాద్ నుంచి డాక్టర్ సుమలత, సుగుణ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వరంగల్ నుంచి సాంబయ్య, భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కరీంనగర్‌కు తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి జీవన్‌రెడ్డి రేసులో ఉన్నారు. ఇక ఖమ్మం నుంచి మంత్రి

6లో ▶

## తెలంగాణలో మళ్లీ కొత్త జిల్లాలు.?

- తెలంగాణలో మరోసారి తెరపైకి జిల్లాల విభజన
- జిల్లాల సంఖ్యను కుదించే యోచనలో ప్రభుత్వం?
- లోక్ సభ నియోజకవర్గాల వారీగా కొత్త జిల్లాలు.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో మరోసారి జిల్లాల విభజన జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో 2016 అక్టోబర్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. అయితే అవసరం లేకున్నా ప్రజల డిమాండ్లకు అనుగుణంగా కొన్ని జిల్లాలను ఏర్పాటు చేశారనే వాదన ఉంది. ఉదాహరణకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్న సికింద్రాబాద్ లోక్ సభ స్థానాన్ని జిల్లాగా ఏర్పాటు చేయకుండా తొమ్మిది మండలాలతో ములుగును మాత్రం కొత్త జిల్లాగా ఏర్పాటు

6లో ▶

## నీకు దమ్ముంటే మనమిద్దరం పోటీ చేద్దాం

### - రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

- మల్కాజ్‌గిరిలో పోటీ చేద్దామంటే రేవంత్ రెడ్డి స్పందించడం లేదన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి మోదీ మనిషా? లేక రాహుల్ గాంధీ మనిషా? అర్థం కావడం లేదని ఎద్దేవా
- ఈటల రాజేందర్ మంచి డైలాగ్స్ కొడతాడు, నమ్మి ఓటు వేయవద్దని వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పది లక్షల మంది ఫోన్లను ట్యాపింగ్ చేశారని యూట్యూబుల్లో వీడియోలు పెడుతున్నారని ఒకరిద్దరు ఫోన్లు ట్యాప్ చేసి ఉండవచ్చని దానికే ఎందుకు ఇంత రాద్ధాంతమని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి మొదలుకుంటే యూట్యూబ్‌లో మొరిగే కుక్కల దాకా ఓటుతోనే సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు.

6లో ▶

## చేనేత కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్

- ప్రజాగళం ప్రచారంలో చంద్రబాబు హామీలు



**చిత్తూరు (ప్రశ్న న్యూస్)** చేనేత కార్మికులకు చంద్రబాబు కీలక హామీ ఇచ్చారు. పవర్ లూమ్స్ పెట్టుకున్న వారికి 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని నగరి ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రకటించారు. అంతకు ముందు పలమనేరు నియోజకవర్గంలోనూ ప్రజాగళం ప్రచారసభ నిర్వహించారు. యువత ఆశలను సీఎం జగన్ వమ్ము చేశారని విమర్శించారు. ప్రజాగళం యాత్రలో భాగంగా పలమనేరులో ఆయన మాట్లాడారు.

**ఐదేళ్లలో పాతిక లక్షల ఉద్యోగాలు**

అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జగన్ మోసపూరిత మాటలతో ప్రజలను ఐదేళ్ల పాటు మోసం చేశారన్నారు. రాయలసీమ అభివృద్ధికి జగన్ చేసిందేమి లేదన్నారు. అనంతపురానికి నీళ్లు తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. కియా పరిశ్రమను అనంతపురం జిల్లాలో ఏర్పాటయ్యేలా టీడీపీ ప్రభుత్వం కృషి

6లో ▶

## వేలంలో రూ. 40 కోట్లు పలికిన నెల్లూరు ఆవు

- ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఆవుగా రికార్డ్



అమరావతి / బ్రెజిల్ (ప్రశ్న న్యూస్) మన దగ్గర దొరికే ఒంగోలు, నెల్లూరు మేలు రకానికి చెందిన ఆవులు

6లో ▶

## ఏపీ బీజేపీ అభ్యర్థుల ప్రకటన

### - సోము వీర్రాజు దారెటు.?




**అమరావతి (ప్రశ్న న్యూస్)** సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల గడువు సమీపించిన వేళ రాష్ట్రంలో ప్రతిపక్ష తెలుగుదేశం-జనసేన- భారతీయ జనతా పార్టీ కూటమి ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారించింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తయింది. టీడీపీ అయిదు, జనసేన మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించాల్సి ఉంది. బీజేపీ తాజాగా 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను వెల్లడించిన విషయం తెలిసిందే. ఎచ్చెర్ల- ఎన్ ఈశ్వరరావు,

6లో ▶

# వింటర్ బ్లూస్ వేధిస్తుంటే..




శీతకాలం రాగానే కొందరిలో తెలియని నీరసం ఆవహిస్తుంది. ప్రతి చలికాలం ఇలానే జరుగుతుంటే.. సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ (ఎస్ఏడీ)కు గురవుతున్నట్టు లెక్క. దీన్నే ఆంగ్లంలో **'వింటర్ బ్లూస్' అంటారు. ఈ రుగ్మత లక్షణాలు..**మనసులో అకారణ బాధ, నిరుత్సాహం, నిరాసక్తత, అతిగా తినడం, వేగంగా బరువు పెరగడం, అధిక కార్బొహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవాలనే కోరిక కలగడం, అతి నిద్ర, అలసట.. సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్‌ను సూచించేవే. చలికాలంలో సూర్యకాంతి తగ్గడం వల్ల శరీరంలోని జీవగడియారం పని తీరుకు అంతరాయం కలుగుతుంది. దీన్నొక కారణంగా చెప్పవచ్చు. ఎండ తక్కువగా తగలడం వల్ల రక్తంలో సెరటోనిన్‌గా పిలిచే ఫీల్‌గుడ్ హార్మోన్ స్థాయిలు తగ్గిపోతాయి. ఫలితంగా నిరుత్సాహం, కుంగుబాటు ఆవహిస్తాయి. వంశ పారంపర్యంగానూ వచ్చే ఆస్కారం ఉంది. లోపం ఇదే.. ప్రధానంగా విటమిన్-డి తక్కువగా ఉండే ఆహారం తీసుకునే వారు దీని బారిన పడతారు. జాగ్రత్త పడాల్సిందే.. శీతకాలంలో వచ్చే ఈ సమస్యల్ని అశ్రద్ధ చేస్తే తీవ్ర అనారోగ్యానికి దారితీయవచ్చు. నలుగురిలో కలవ లేకపోవడం, ఆఫీసులో సరిగ్గా పనిచేయలేకపోవడం ప్రధాన లక్షణాలు. మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడవచ్చు. అకారణ దుఃఖం, ప్రతికూల ధోరణులు, ఆత్మహత్య ఆలోచనలు వెంటాడుతాయి. విటమిన్-డి మాత్రలతో పాటు యాంటీ డిప్రెసెంట్స్ ఇస్తారు. వివిధ థెరపీల ద్వారా వైద్యులు చికిత్స చేస్తారు. వ్యాయామం, సమ తులాహారమూ ముఖ్యమే.

# అకుశలాలు చివరికి దుఃఖాన్నే తెచ్చిపెడతాయి..



కుశల కర్మలు అంటే మంచి పనులు. అకుశల కర్మలు అంటే చెడ్డ పనులు. ప్రతి మనిషి మనస్సులో, ఆలోచనల్లో ఈ రెండూ ఉంటాయి. పుట్టుకతోనే 'వీరు మంచివారు' 'వీరు చెడ్డవారు' అని విభాగించుకుని పుట్టరు. వ్యక్తిగా, సామాజికంగా పెరిగిన కొద్దీ మనలో ఈ భావాలు పెరుగుతాయి. కుశల ధర్మాలు మనకి శాంతిని ఇస్తాయి. అకుశలాలు చివరికి దుఃఖాన్నే తెచ్చిపెడతాయి. అయితే మనిషి దుఃఖంలేని కుశల మార్గంలోనే నడవడం ఏదోఒక క్షణంలోనో, రోజులోనో జరిగే పని కాదు. ఎంత సాధన చేసి మంచిగుణాలు అలవర్చుకున్నా ఏదో క్షణంలో బుద్ధుడు చెప్పినట్లు చిటికె వేసినంత కాలంలో%--% అకుశలం వచ్చి ఆవహించేస్తుంది. కాబట్టి మనిషి కుశల చిత్తంతో మెలగాలంటే నిరంతరం అదే ధ్యాసలో ఉండాలి. నడవాలి. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు ఎందరో భిక్షువులు ఎంతెంతో సాధన చేసినవారు కూడా ఆ చిటికెల కాలంలోనే దారి తప్పేవారు. ఈ విషయంలో ఎందరో బుద్ధుని దగ్గరకు వచ్చి...'భగవాన్! మా చిత్తాన్ని నిలుపుకోలేకపోతున్నాం. ఏదో క్షణంలో చెడ్డ భావాలు వచ్చి పడుతున్నాయి. వానినుండి ఎలా బైటపడగలం" అని అడిగేవారు. అప్పుడు బుద్ధుడు... 'మీరు అందుకోసం నిరంతరం పది సాధనా మార్గాల్లో ఉండాలి' అంటూ వాటి గురించి చెప్పాడు. అప్రమత్తంగా ఉండటం, సోమరితనంతో గడపడం, అతిగా కోరుకోవడం, ఎంత లభించినా ఇంకా, ఇంకా కావాలి అనే అసంతృప్తి నిరంతరం నిర్లక్ష్యంగా ఉంచే అజాగ్రత్త, ఏ విషయాన్నైనా లోతుగా గ్రహించకపోవడం వల్ల కూడా అవగాహనాలేమి, చెడ్డవారి స్నేహం, వీటితోపాటుగా జాగరూకతను నిరంతరం పెంచుకోకపోవడం చెడ్డవారిని అనుసరిస్తూ, అకుశల కర్మలే శిక్షపొందుతూ ఉంటే.. ఈ పది కార్యాల వల్ల మనిషితో అకుశల ఆలోచనలు పెరుగుతాయి. అకుశల ఆచరణలు జరుగుతాయి. అలాంటి వానికి సంపద నష్టం, కీర్తి నష్టం, ప్రజ్ఞ నష్టం, సకలం నష్టం. దీనివల్ల దుఃఖం. అలాగే కుశల ధర్మాలు పెరగాలంటే ప్రమత్తతను వీడి అప్రమత్తతతో సోమరితనాన్ని వదిలి ఉండాలి. పట్టువదలని సాధనలో ఉండాలి. అధిక కోర్కెల్ని వదిలి, బతకడానికి సరిపడు మితమైన కోర్కెలు (అల్పేచ్ఛ) కలిగి ఉండాలి. సంతృప్తి కలిగి, జాగరూకతతో మెలగాలి. ప్రతి విషయం పైనా మంచి అవగాహన పెంపొందించుకోవాలి.

మంచిని చేకూర్చే మంచి మిత్రులతోనే స్నేహం చేయాలి. మంచివారిని అనుసరించాలి. మంచి కర్మల శిక్షణ పొందాలి. ఈ పది కార్యాల వల్ల మనిషిలో కుశల ఆలోచనలు పెరుగుతాయి. కుశల ధర్మాలు ఉద్భవిస్తాయి. కుశలాచరణ కలుగుతుంది. అలాంటి వారికి సంపద నష్టం కాదు. కీర్తికి నష్టం రాదు. ప్రజ్ఞ దిగజారిపోదు. దుఃఖం దరికే రాదు. అని చెప్పాడు బుద్ధుడు. ఇలా ప్రతి వ్యక్తి తనను తాను తీర్చిదిద్దుకుంటే, అది వ్యక్తికి, సంఘానికి, దేశానికి, ప్రపంచానికి మేలు అని బోధించిన తథాగత బుద్ధునికి జేజేలు!

# ఈ తమ్ముడు మళ్ళీ దొరకడు!



'ఇమ్ముగ చదువనినోరును, అమ్మాయని పిలిచి అన్నమడుగని నోరున్, తమ్ముల పిలువని నోరును..." అన్న సుమతీ శతకంలోని పద్యం గురించి తెలుసుకుంటున్నాం. లోకంలో స్నేహితులు ఎక్కడికెళ్ళినా దొరుకుతారు. చిన్నతరగతులనుంచీ, కళాశాలలు ...ఆ తరువాత ఉద్యోగాల్లో ...అలా అన్ని స్థాయిల్లో, అన్ని ప్రాంతాల్లో, అన్ని వేళ ల్లో దొరుకుతారు. పెళ్ళిళ్ళు తదితరాలతో బాంధవ్యాలు కలిసి బంధువులు కూడా కొత్తగా దొరుకుతుంటారు. పుట్టగానే పరమేశ్వరుడిచ్చిన బంధుత్వం మాత్రం అమ్మానాన్నలతోనే. వాళ్ళ ఆఖరి ఊపిరి వరకు వాళ్ళు కోరుకునేది, నీవు వాళ్ళకు ఏదో చేయాలని కాదు, నీకు వాళ్ళేం చేయగలరని...! ఆ ఆర్తి సహజంగా వాళ్లకు తప్ప వేరెవరికీ ఉండనే ఉండదు. అటువంటి వాటిలో ఒకటి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళతో ఉండే అనుబంధం. నాతో కలిసి పుట్టిన వాళ్ళతో అనుబంధం అపూర్వం. నా తమ్ముడు ఈ జన్మకంతటికీ వాడే నా తమ్ముడు. అక్క ఈ జన్మకు ఆమే అక్క. నేను చాలామందిని చెల్లెళ్ళగా చూడవచ్చు. కానీ మా అమ్మానాన్నల కడుపున నాతో కలిసి పుట్టిన చెల్లి అదొక్కతే. దానితో సమానం మాత్రం ఎవరూ కారు, కాలేరు. వాచికంగా.. ఆమె నా చెల్లెలి తో సమానం అంటాం. కానీ ఆమె స్థానాన్ని భర్తీ చేయడం మాత్రం సాధ్యం కాదు. తోడబుట్టినవాడు అంటే ఆ అనుబంధం మరొకరితో ఉండదుగాక ఉండదు. శ్రీ రామాయణం లో రావణాసురుడు ప్రయోగించిన శక్త్యాయుధం ఒకటి లక్ష్మణుడిని తాకి ఆయన కిందపడి మూర్ఛిల్లాడు. యుద్ధంలో ఉన్న రాముడు వెంటనే వచ్చి తమ్ముణ్ణి పట్టుకుని బావురుమని ఏడ్చాడు. "దేశేదేశే కళత్రాణి దేశేదేశే చ బాంధవః తం తూ దేశ నా పశ్యామి యాత్ర భ్రాత్ర సహోదరః" అన్నాడు. భార్య దొరుకుతుంది, బంధువులు ఎక్కడికెళ్ళినా దొరుకుతారు. కానీ వాడొక్కడే ఈ జీవితానికి. అంత అపురూపం రా అన్నదమ్ములు. నువ్వే లేకపోతే నాకెందుకురా ఈ రాజ్యాలు, ఈ సుఖాలు? నాకోసం అడవికి వచ్చావు, నా కోసం యుద్ధానికి వెళ్లావు, నువ్వే పడిపోయిన నాడు నాకు మిగిలిన సుఖాలు అన్నీ ఏకమై తిరిగి లభించినా, వాటివల్ల ప్రయోజనమేమిటి?" అని అడిగాడు. తోడబుట్టినవాడు వెళ్ళిపోయిన తరువాత బతుకు శూన్యమని భావించాడు. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురూ పట్టాభిషేక సమయానికి బతికే ఉన్నారు. వాలి సుగ్రీవుల్లో వాలి మరణించాడు. రావణ కుంభకర్ణులు ఇద్దరూ పోగా విభీషణుడొక్కడు మిగిలాడు. రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల మైత్రీబంధం చూసి అక్కడే ఉన్న విభీషణుడు 'మేం మా సోదరులతో ఇలా బతకలేక పోయాం...' అని చాటుగా కళ్ళొత్తుకున్నాడు. సుగ్రీవుడి కళ్ళు చెమర్చాయి. అన్నగారు బాగా పెద్దవాడయి పోయిన తరువాత కూడా నెమ్మదిగా వాహనం దిగుతుంటే తమ్ముళ్ళు గబగబా వెళ్ళి చెయ్యి ఆసరాగా ఇచ్చి 'అన్నయ్యా! జాగ్రత్త' అంటూ తీసుకువస్తుంటే, ఏ విషయమైనా అన్నయ్యకు చెప్పి చేస్తుంటే.. తమ్ముళ్ళ మంచీచెడూ విచారించే అన్నయ్య ఎప్పుడూ వాళ్ళకు తోడుగా ఉంటే అసలు ఆ ఇంట ఎంత ఆరోగ్యం, ఎంత ఆయుర్దాయం ఉంటుందో... ఆ రక్తసంబంధం ఉన్నవాళ్లు కలుసుకోవడం ఎంత సంతోషంగా ఉంటుందో..!!!

# దోమలు మన దగ్గరకే రాకుండా ఉండాలంటే ఏం చేయాలంటే?



సాయంత్రమైందంటే చాలు పరుగెత్తుకొస్తాయి దోమలు. చెవుల పక్కన చేరి వాటి భాషలో హాలో చెబుతుంటాయి. కుట్టి కుట్టి రక్తాన్ని పీల్చేస్తుంటాయి. అంతటితో అయిపోతుందా.. లేనిపోని రోగాలను కూడా అంటిస్తాయి. అందుకే దోమ తెరలు, ఆల్ అవుట్‌లు, రకరకాల ప్రయోగాలతో దోమల్ని దూరం పెట్టేందుకు ప్రయత్నిస్తుంటాం. ఇవన్నీ సరే.. మనం ఎక్కడున్నా సరే అసలు దోమలు మన దగ్గరకే రాకుండా ఉండాలంటే ఏం చేయాలని చాలా మంది అనుకునే ఉంటారు. తాజాగా శాస్త్రవేత్తలు కూడా ఇదే ఆలోచనపై పరిశోధన చేశారు. 4 రకాల రంగుల బట్టలు వేసుకుంటే దోమలు మనల్ని కాస్త తక్కువగా కుడతాయని, ఇంకో 4 రకాల రంగుల బట్టలేసుకుంటే మాత్రం 'అంతే' సంగతులని కనుగొన్నారు. ఆ రంగుల కథేంటో, దోమలు రంగులను ఎలా గుర్తిస్తు న్నాయో తెలుసుకుందాం. మనుషులు విడుదల చేసే కార్బన్ డై ఆక్సైడ్, చెమట వాసన, శరీర ఉష్ణోగ్రతను గుర్తించాక నేరుగా మనుషుల దగ్గరకు దోమలు వస్తున్నాయని ఇదివరకే కనుగొన్నారు. తాజా పరిశోధనలో నాలుగో అంశాన్ని కూడా శాస్త్రవేత్తలు గుర్తించారు. అదే 'రంగు'. చెమట, కార్బన్ డై ఆక్సైడ్ వాసన గుర్తించనంత వరకు మనుషులున్నా, ఇంకేమున్నా దోమలు పట్టించుకోలేదని.. కానీ వాటి వాసనను పసిగట్టాక మాత్రం ఆ వాసన వస్తున్న వైపు ఎగురుతున్నాయని గుర్తించారు. అయితే ఇందులోనూ ఇంకో ఆసక్తికరమైన అంశాన్ని కనుగొన్నారు. వాసన వచ్చే ప్రాంతంలో ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగులవైపు దోమలు ఎక్కువగా వెళ్లాయని.. ఆకుపచ్చ, ఊదా, నీలం, తెలుపు రంగులను పట్టించుకోలేదని గమనించారు. మనుషుల శరీరం దోమలకు ఎరుపు%--%నారింజ రంగు రూపంలో కనిపిస్తుందని, అందుకే నేరుగా మన దగ్గరకు వచ్చేస్తాయని తెలుసుకున్నారు. మన శరీర ఛాయతో వాటికి సంబంధం లేదని, అన్ని శరీరాలూ వాటికి ఎరుపు%--%నారింజ రంగులోనే కనిపిస్తాయని చెబుతున్నారు. కాబట్టి ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగుల బట్టలు వేసుకుంటే మన శరీర రంగుకు ఆ బట్టల రంగు తోడై దోమలు మరింత ఎక్కువగా మన దగ్గరకు వస్తాయని అంటున్నారు. ఆకుపచ్చ, ఊదా, నీలం, తెలుపు రంగుల బట్టలు వేసుకుంటే కాస్త తక్కువగా ఆకర్షితమవుతాయని వివరిస్తున్నారు. పరిశోధన కోసం ఒక్కో దోమను ఒక్కో టెస్ట్ చాంబర్‌లో పెట్టి మరీ శాస్త్రవేత్తలు పరీక్ష చేశారు. ఈ చాంబర్‌లలోకి రకరకాల వాసనలు పంపారు. అదే సమయంలో రకరకాల రంగులను ప్రదర్శించి చూశారు. ఎలాంటి వాసన లేనప్పుడు చాంబర్‌లో ఎలాంటి రంగును ప్రదర్శించినా దోమలు పట్టించుకోలేదు. కార్బన్ డై ఆక్సైడ్‌ను పంపాక ఆకుపచ్చ, నీలం, ఊదా రంగులను ప్రదర్శించినా పెద్దగా స్పందించలేదు. కానీ కార్బన్ డై ఆక్సైడ్‌తోపాటు ఎప్పుడైతే ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగులను ప్రదర్శించారో ఆ రంగుల వైపు వెళ్లడం గమనించారు. మామూలుగా మనం రోడ్డుపై వెళ్తున్నప్పుడు మంచి బిర్యానీ వాసన వస్తే 'ఎక్కడినుంచబ్బా' అని అటూ ఇటూ చూస్తాం. దోమలు కూడా కార్బన్ డై ఆక్సైడ్ వాసన రాగానే 'వాటి బిర్యానీ' ఎక్కడని చూస్తాయని శాస్త్రవేత్తలు సరదాగా చెప్పారు. శాస్త్రవేత్తలు తమ చేతికి రకరకాల గ్లోవ్స్ వేసుకొని కూడా పరిశీలించారని, అందులోనూ ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగు గ్లోవ్స్ వైపు దోమలు ఎక్కువగా వెళ్లాయని.. ఆకుపచ్చ, ఊదా, నీలం, తెలుపు రంగుల గ్లోవ్స్‌ను పట్టించుకోలేదని తెలిపారు. దోమలు వాటి ఆహారాన్ని ఎలా వెతుకుతాయో తెలుసుకోవడానికి ఇది తొలిమెట్టేనని, మనుషుల శరీరం నుంచి వచ్చే వాసనలను ఎలా అవి గుర్తిస్తున్నాయో తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు.

# ఆ ఊరే ఓ సైన్యం..

## ఉగ్గిపాలతో పాటు ధైర్యాన్ని నూరి పోస్తూ..



ముగడ(బాడంగి)/విజయనగరం: ఆ గ్రామ తల్లులు తమ పిల్లలకు ఉగ్గిపాలతో పాటు ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. దానినే ఊపిరిగా మారుస్తున్నారు. వీరులుగా తీర్చిదిద్దుతున్నారు. క్రమశిక్షణ అలవాటు చేస్తూ భరతమాత సేవకు సిద్ధం చేస్తున్నారు. యుక్తవయసు రాగానే సరిహద్దులో సేవలందించేందుకు పంపిస్తున్నారు. అందుకే.. ఆ ఊరే ఓ సైన్యంగా మారింది. ధైర్యసాహసాలతో శత్రుదేశ సైనికుల్లో వణుకుపుట్టించే మిలటరీ వీరులకు పుట్టినిల్లుగా మారిన ముగడ గ్రామంపై ఈ వారం 'సాక్షి' సండే స్పెషల్. ఈ గ్రామం పేరుచెబితే ఠక్కున గుర్తొచ్చేది సైనికులే. గ్రామంలో సుమారు 983 కుటుంబాలు నివసిస్తుండగా.. 200 మంది ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, బీఎస్ఎఫ్ దళాల్లో పనిచేస్తున్నారు. నాలుగువేల మంది జనాభా ఉన్న గ్రామంలో రెండువేల మందివరకు విద్యావంతులు ఉన్నారు. గ్రామ యువత క్రమశిక్షణకు మారుపేరు. స్వాతంత్ర్యం వచ్చిన నుంచి గ్రామానికి చెందిన యువకులు సైన్యంలో సేవలందిస్తూ వస్తున్నారు. తల్లులు ధైర్యాన్ని నింపుతూ పిల్లలను పెంచుతుంటే... తండ్రులు దేశ సేవలో తరలించేలా ప్రోత్సహిస్తున్నారు. త్రివిధ దళాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచే శారీరక దారుఢ్యం పెంచుకునేలా తర్ఫీదునిస్తున్నారు. రక్షణ దళాల్లో చేరేందుకు అవసరమైన విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. చైతన్యం నింపుతున్నారు. గ్రామానికి చెందిన దాదాపు 63 మంది త్రివిధ దళాల్లో పనిచేసి ఉద్యోగవిరమణ పొందారు. మరికొందరు కల్నల్, లెఫ్ట్‌నెంట్ కల్నల్, సేబేదార్ వంటి కేడర్‌లలో పనిచేస్తున్నారు. స్వర్గీయ చప్ప సూర్యనారాయణ (వైద్యాధికారి)గా పనిచేయగా, స్వర్గీయ కోటస్వామినాయుడు, తెంటు స్వామినాయుడు కల్నల్‌గా సేవలందించారు. ప్రస్తుతం యమాల శ్రీనివాసరావు రాజస్థాన్ కోటిలో సుబేదార్‌గా పనిచేస్తుండగా, చొక్కాపు విజయ్‌కుమార్ అస్సాంలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మత్సరాము మద్రాస్ ఇంజినీరింగ్ సర్వీస్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. వైమానికాదళంలో వివిధ క్యాడర్లలో పనిచేసి రిటైర్ అయినవారిలో మత్స మురళీధరరావు, మత్సరాము ఉన్నారు. మత్సరాము కొడుకు వైమానిక దళంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ముగడలో సైనికులు స్వయంగా ఓ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో దినపత్రికలతో పాటు గ్రామ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈ గ్రంథాలయమే ఉద్యోగాల సాధనకు బాసటగా నిలుస్తోంది. విజ్ఞానం పంచుతోంది. దేశానికే కాదు.. తమ గ్రామానికి సైనికులు సేవలందిస్తున్నారు. వివిధ పర్వదినాల్లో గ్రామానికి చేరకుని పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. సొంత డబ్బులతో రోడ్లు బాగుచేస్తున్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నారు. అందుకే...గ్రామం ఎప్పుడు చూసినా పరిశుభ్రంగా కనిపిస్తుంది. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను ఘనంగా జరుపుతారు. దేశభక్తిని ప్రదర్శిస్తారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మిలటరీలో చేరేందుకు యువకులు భయపడేవారు. అప్పట్లో గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యామల స్వామినాయుడు మిలటరీలో చేరేలా యువతను ప్రోత్సహించారు. సొంత బావమరిది కోట స్వామినాయుడు మిలటరీలో చేరేలా శిక్షణ ఇచ్చారు. ఆయన కల్నల్ స్థాయికి ఎదిగి గ్రామ యువతకు మార్గదర్శకంగా నిలిచారు. సైన్యంలో చేరేలా యువతకు స్ఫూర్తిమంత్రం బోధించారు. అప్పటి నుంచి గ్రామ యువత దేశ సేవకు పునరంకితమవుతూనే ఉంది. ఆర్మీలో చేరడం గర్వంగా ఉంది. వివిధ క్యాడర్లలో పనిచేశాను. ప్రస్తుతం రాజస్తాన్‌లోని కోటలో సుబేదార్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. నా తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా..

చదువులో ప్రోత్సహించారు. వారిచ్చిన నైతిక మద్దతుతోనే సైన్యంలో చేరాను. వైమానిక దళంలో పనిచేయడం నా అదృష్టం దేశరక్షణలో భాగంగా త్రివిధ దళాల్లో ఒకటైన వైమానికదళంలో ఫిట్టర్‌గా, వర్క్‌డ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాను. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివిన వెంటనే ఎయిర్‌ఫోర్స్‌కు సెలక్టయ్యాను. నా తండ్రి మత్ససూర్యనారాయణ మద్రాస్‌లో డాక్టర్ కోర్స్ చదివారు. ఆయన ప్రోత్సాహంతోనే వైమానిక దళంలో చేరాను. దేశానికి సేవచేసే భాగ్యం కలగడం నా అదృష్టం.

## మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో

# ఉచిత గుండె వైద్య శిబిరం

**కోరుట్ల** కోరుట్ల పద్మశాలి సంఘ భవనంలో బుధవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సంధర్భంగా వైద్యులు బిపి, షుగర్, ఈసీజీ, 2డి-ఎకో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ ఎంతో ఖరీదైన గుండె పరీక్షలను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చామని, దీంతో గుండెకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. గుండె సమస్యలు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించే సదుపాయం ఉందని తెలిపారు. గుండె సమస్యలు ఉన్నవారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ సిబ్బంది చంద్రశేఖర్, కుంబాజి సాయితేజ, పద్మశాలి సంఘం నాయకులు రుద్ర శ్రీనివాస్, ఎంబేరి నాగభూషణం, ఎక్కల్ దేవి నవీన్, ముల్క ప్రసాద్, గడ్డం మధు, కైరంకొండ రాజగంగాధర్, గుండేటి రాజశేఖర్, అందె రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# ఎన్నికల రిటర్నింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



**తిరుపతి** ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం వహించిన స్థానిక ఎన్నికల అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ జి లక్ష్మీ శ కు అర్జీ సమర్పించిన తిరుపతి జిల్లా టి.డి.పి ముఖ్య నాయకులు భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్లో 2024 అసెంబ్లి, పార్లమెంటు ఎన్నికలు సంబంధించిన ఎన్నికల కోడ్ అమలలో ఉన్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ను తుంగలో తొక్కే విధంగా రేణిగుంట మండలం, గురువరాజు పల్లి, తిరుపతి విమానాశ్రయం సమీపంలో మంగళవారం వైసిపి పార్టీకి చెందిన ఎన్నికల ప్రచార సామాగ్రి డంప్ ను ఎఫ్.సి. ఐ గోడౌన్ నందు టిడిపి కార్యకర్తలు గుర్తించారు. ఈ విషయమై స్థానిక తహసీల్దరు గానీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గాని స్పందించలేదని జిల్లా కలెక్టర్కు అర్జీ సమర్పించి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా టిడిపి ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఈ భారీ డంపు పై సి-విజిల్ యాప్లో ఫిర్యాదు చేసిన గానీ సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు అని వాపోయారు. శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేయాలని తాయిలాలతో ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించే వైసిపి అభ్యర్థులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎఫ్.సి. ఐ గోడౌన్లో వై .సి.పి పార్టీ వారు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మహిళా ఓటర్లకు చీరలు, పార్టీ గుర్తు ఉన్న చేతి గడియారాలు, మగ ఓటర్లకు టీ షర్టులు, వ్యాపారులకు పార్టీ గుర్తు ఉన్న పండ్లు, కూరగాయలు గొడుగులు. గ్రామాల్లో యువతను అలరించేందుకు వైర్లెస్ హ్యాండ్ మైక్, వైర్లెస్ లౌడ్స్పీకర్లు, ప్రతి ఓటరును ఆకర్షించేందుకు పార్టీ గుర్తు ఉన్న వర్షపు గొడుగులు, డమ్మీ ఓటు నొక్కేందుకు ఈవీఎంలు, జగన్ మోహన్ రెడ్డి ముఖ చిత్రాలు, సెల్ఫోన్ కవర్లు, గ్లెండర్లు, కుక్కర్లు, ఇతర వైఎస్సార్సిపి మెటీరియల్లు కూడా లభ్యమయ్యాయి అని అన్నారు.ఎన్నికల కోడ్ అమలు లో ఉన్న కూడా స్థానిక అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారు అని మండిపడ్డారు. మిగిలిన గోడౌన్లను సైతం తనిఖీ చేసి వాటిపై తగు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కూడా అలసత్వం వహిస్తున్న స్థానిక తహసిల్దారుపై రిటర్నింగ్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, శ్రీకాళహస్తి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి ,టిడిపి సానుభూతిపరులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పలు రైళ్లు దారి మళ్లింపు

**విజయవాడ :** విజయవాడ డివిజన్లో జరుగుతున్న రైల్వే ట్రాక్ల నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను పూర్తిగా, కొన్నింటిని పాక్షికంగా, మరికొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్ మంగళవారం ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి 28 వరకు మచిలీపట్నం విశాఖపట్నం (17219), గుంటూరు విశాఖపట్నం (22701/22702), ఏప్రిల్ 2 నుంచి 29 వరకు విశాఖపట్నం?మచిలీపట్నం (17220) రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. అలాగే ఏప్రిల్ 1 నుంచి 28 వరకు మచిలీపట్నం విజయవాడ (07896), విజయవాడ మచిలీపట్నం (07769), నర్సాపూర్ విజయవాడ (07863), విజయవాడ నర్సాపూర్ (07866), మచిలీపట్న విజయవాడ (07770), విజయవాడ భీమవరం జంక్షన్ (07283), మచిలీపట్నం విజయవాడ (07870), విజయవాడ నర్సాపూర్ (07861) రైళ్లు విజయవాడ రామవరప్పాడు మధ్య పాక్షికంగా రద్దు అయ్యాయి.

**దారి మళ్లింపు..**

ఏప్రిల్ 1, 8, 15, 22 తేదీల్లో ఎర్నాకుళంపాట్నా (22643), ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో భావ్నగర్ కాకినాడ పోర్టు (12756), ఏప్రిల్ 3, 5, 10, 12, 17, 19, 24, 26 తేదీల్లో బెంగళూరు?గౌహతి (12509), ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీల్లో ఛత్రపతి శివాజీ టెర్మినస్ (11019), ఏప్రిల్ 1 నుంచి 28 వరకు ధనాబాద్ అలప్పుజ (13351), ఏప్రిల్ 4, 11, 18, 25 తేదీల్లో టాటా యశ్వంత్పూర్ (18111), ఏప్రిల్ 3, 10, 17, 24 తేదీల్లో జసిదిహ్ తాంబరం (12376), ఏప్రిల్ 1, 8, 15, 22 తేదీల్లో హతియ ఎర్నాకుళం (22837), ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో హతియ ?బెంగళూరు (18637), ఏప్రిల్ 2, 7, 9, 14, 16, 21, 23, 28 తేదీల్లో హతియ బెంగళూరు (12835), ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీల్లో టాటా బెంగళూరు (12889) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్లించారు.

## సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు అర్ జే రత్నాకర్ను మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు

**- సాదర స్వాగతం పలికిన అర్ జే రత్నాకర్.**



**పుట్టపర్తి** పుట్టపర్తి శ్రీభగవాన్ సత్యసాయి బాబా సెంట్రల్ ట్రస్టు సభ్యులు అర్ జే రత్నాకర్ ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, ఆమె భర్త పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి లు పుష్పగుచ్చం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. పుట్టపర్తి లోని అర్ జే రత్నాకర్ నివాసానికి బుధవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు విచ్చేసి ప్రత్యేకంగా రత్నాకర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. తన నివాసానికి విచ్చేసిన పుట్టపర్తి నియోజకవర్గ టీడీపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, భర్త పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె కు ట్రస్టు సభ్యులు రత్నాకర్ వారికి సాదర స్వాగతం పలికారు. తన కోడలు పల్లె సింధూర,కుమారుడు పల్లె కృష్ణ కిషోర్ రెడ్డిని రత్నాకర్ కు ప్రత్యేకంగా పరిచయం చేశారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పల్లె సింధూర రెడ్డి కి అయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపి అల్ ద బెస్ట్ అని విషెస్ తెలిపారు. భవిష్యత్ లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని రత్నాకర్ ఆమెను అభినందించారు.

## శ్రీశ్రీ కళావేదిక తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా

# అరవ జయపాల్

**- రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కూడా ఎంపిక**

**- ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి**



**తిరుపతి :** శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా శాఖ నూతన కమిటీని ఎంపికజేశామని రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు తెలిపారు. జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా సీనియర్ కవి అరవ జయపాల్ ను నియమించామన్నారు. గత రెండేళ్లుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వుంటూ తనదైన శైలిలో సంస్థ అభివృద్ధికి కృషిచేస్తున్నారని చెప్పారు. ఏడాది క్రితం మహతి ఆడిటోరియంలో 48 గంటలపాటు సాహితీ బ్రహ్మోత్సవాల నిర్వహణలో చురుగ్గా పనిచేశారన్నారు. జానపద కళాకారులను ప్రోత్సహిస్తూ ఇటీవల వరసగా రెండు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. సంస్థ మరింత బలోపేతం కోసం భవిష్యత్తులో పలు కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలను కూడా రూపొందించారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా కూడా విశేషసేవలందిస్తున్న జయపాల్ కు రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పదోన్నతి కల్పించినట్లు గుత్తా హరి ప్రకటించారు. అలాగే జిల్లా ప్రధానకార్యదర్శిగా కవయిత్రి, అధ్యాపకురాలు ధనాశి ఉషారాణిని ఎంపికజేశామన్నారు. గౌరవ సలహాదారుగా సాకం నాగరాజు, గౌరవాధ్యక్షులుగా డా. వి.ఆర్. రాసాని, డా. రోజారమణి, ఎన్. విశ్వనాథరెడ్డి, సమన్వయకమిటీ సభ్యులుగా పూతలపట్టు అంజయ్య, సంగీతం సుబ్రమణ్యంలు వ్యవహరిస్తారని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా రాళ్లపల్లి రజని, జి. సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శులుగా మహేశ్వరి, మందలపు నటరాజ్, టి. గుణశేఖర్, మహిళాకార్యదర్శులుగా బెజవాడ నాగమణి, హేమమాలిని, రుక్మిణీరెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యునిగా రంద్రాసి రుద్రను నియమించామన్నారు. సంస్థ ఆశయసాధన కోసం రెండేళ్లపాటు ఈ కమిటీ పనిచేస్తుందన్నారు.

## నిర్మాణానికి నోచుకోని

# కమలబంద బీటీ రోడ్డు

**- సుమారు ఐదేళ్లు గడుస్తున్న ప్రారంభం కానీ పనులు**

**దుంబ్రిగుడ** మారుమూల గిరిజన గ్రామాల్లో రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేస్తున్న స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు జరగకపోవడంతో గిరిజనులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. మండలంలోని సొవ్వ పంచాయితీ కమలబంధలో బిటి రోడ్డు నిర్మాణానికి గత 2019లో నిధులు మంజూరైన ఇప్పటికీ సుమారు ఐదేళ్లు గడుస్తున్న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించక పోవడమే ఇందుకు నిదర్శనం. సోవ్వ రోడ్డు జంక్షన్ నుంచి ఆ గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది.ప్రస్తుతం ఆ గ్రామంలో మట్టి రోడ్డు ఉన్నప్పటికీ వర్షాకాలంలో రోడ్డు అంతా బురదమయంగా మారుతుండడంతో రవాణా సౌకర్యానికి ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఉపయోగిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డుపైన బురద పేరుకుపోతుండటంతో వాహనాలు జారిపోతూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ గ్రామస్తులు అంటున్నారు. పనులు ప్రారంభానికి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను చేపట్టకుండా నిలిపేశారు. రోడ్డు పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు పట్టించుకోవడంలేదని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కమలబందలో మంజూరైన నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి రవాణా కష్టాలు తీర్చాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

# ఏఐఎంఈపి తొలి జాబితా విడుదల

రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణలోని అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్లు ఆల్ ఇండియా మహిళా ఎంపవర్మెంట్ (ఏఐఎంఈపి) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు నౌహీరా షేక్ ప్రకటించారు. సోమాజిగూడలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు జాన్ మస్క్ తో కలిసి తొలి జాబితాను విడుదల చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి తాను స్వయంగా పోటీ చేస్తున్నానని తెలిపారు. చేవెళ్ల నుంచి ఇమామ్ హుస్సేన్, వరంగల్ నుంచి నవ్య, ఖమ్మం నుంచి శామ్యూల్, మెదక్ నుంచి రామచందర్లు బరిలో ఉంటారని నౌహీరా తెలిపారు. మతాలకతీతంగా ఆధ్యాత్మిక చింతనలో కొనసాగుతున్న వ్యక్తులకు పార్టీ నుంచి టికెట్లు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇతర పార్టీలలో లాగా ప్రజలను మభ్య పెట్టబోమని ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పరిమితిలోనే అభ్యర్థులు ఖర్చు చేస్తూ ప్రజల్లోకి వెళ్తామని చెప్పారు. సాంప్రదాయ రాజకీయాలకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పార్టీలకు అవకాశం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థిస్తామని అన్నారు.

## పవర్ లూమ్స్ పెట్టుకున్న వారికి

# 500 యూనిట్ల ఉచిత విద్యుత్

**తిరుపతి :** చేనేత కార్మికులకు చంద్రబాబు కీలక హామీ ఇచ్చారు. పవర్ లూమ్స్ పెట్టుకున్న వారికి 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని నగరి ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రకటించారు. అంతకు ముందు పలమనేరు నియోజకవర్గంలోనూ ప్రజాగళం ప్రచారసభ నిర్వహించారు. యువత ఆశలను సీఎం జగన్ వమ్ము చేశారని విమర్శించారు. ప్రజాగళం యాత్రలో భాగంగా పలమనేరులో ఆయన మాట్లాడారు.అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జగన్ మోసపూరిత మాటలతో ప్రజలను ఐదేళ్ల పాటు మోసం చేశారన్నారు. రాయలసీమ అభివృద్ధికి జగన్ చేసిందేమి లేదన్నారు. అనంతపురానికి నీళ్లు తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. కియా పరిశ్రమను అనంతపురం జిల్లాలో ఏర్పాటయ్యేలా టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు.రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు దివంగత నేత ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని, ఆ ప్రాజెక్టులను తాను మరింత అభివృద్ధి చేశానని తెలిపారు. నీళ్లు వస్తే పరిశ్రమలు వస్తాయి.. నీళ్లు వస్తే అభివృద్ధి జరుగుతుందని చంద్రబాబు తెలిపారు. జగన్ సిద్ధం అంటూ మరో మోసపూరిత యాత్రకు వస్తున్నారని.. ఆయనకు ఖాళీ రోడ్లతో స్వాగతం పలకాలని సూచించారు.చేనేత కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ - ప్రజాగళం ప్రచారంలో చంద్రబాబు హామీలు !జగన్ రాయలసీమ ద్రోహి అని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. తమ వద్దకు రావడానికి వీలులేదని ప్రజలంతా జగన్కు చెప్పాలన్నారు. ఏపీని జగన్ సర్వ నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు మార్చే రోజు మే13వ తేదీ కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఆరోజుతో రాష్ట్రానికి పట్టిన జగన్ అనే శని వదిలిపోతుందని తెలిపారు. జే బ్రాండ్ మద్యం, గంజాయి నుండి రాష్ట్రానికి విముక్తి కలిగించే రోజు మే 13 అవుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి.. జగన్ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

ఉద్యోగస్తులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం లేదని, పెన్షనర్లకు ఒకటో తేదీన పెన్షన్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఒకప్పుడు రాయలసీమ రత్నాల సీమగా ఉండేదని, రాయలవారు ఏలిన ప్రాంతాన్ని జగన్ సర్వనాశనం చేసారన్నారు. నాడు దివంగత నేత ఎన్టీఆర్ రాయలసీమను సస్యశ్యామలం చేశారన్నారు. కరువు సీమగా ఉన్న రాయలసీమలో అన్ని రంగాలను తాను సీఎంగా ఉన్నప్పుడు అభివృద్ధి చేశానని చంద్రబాబు తెలిపారు. పరదాల వీరుడు జగన్ నేడు ముసుగులతో బస్సుయాత్ర మొదలుపెట్టారని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెరగవని హామీ ఇచ్చారు.

# సీఎంఆర్ ఎఫ్ మరో కేసు

**హైదరాబాద్ :** తెలంగాణలో మరో కేసు సంచలనంగా మారుబోతోంది. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్స్లో గోల్మాల్ జరిగిందని కేసు రిజిస్టర్ అయింది. ఇందులో మాజీ మంత్రి హరీష్రావు వ్యక్తిగత సిబ్బంది అరెస్టు కావడం కేసులో కీలకంగా మారుతోంది. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు నలుగుర్ని అరెస్టు చేశారు. వారిలో హరీష్రావు పీఏ నరేష్ ఉన్నాడు. జరుగుతున్న ప్రచారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కార్యాలయం స్పందించింది. "హరీష్ రావు పీఏ సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాజేసిండు అనే వార్తతో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నాం. వాస్తవం ఏమిటంటే నరేష్ అనే వ్యక్తి హరీశ్ రావు వద్ద పీఏ కాదు. అతను ఒక కంప్యూటర్ ఆపరేటర్గా, తాత్కాలిక ఉద్యోగిగా హరీశ్ రావు కార్యాలయంలో పని చేసే వారు. ఆర్థిక, ఆరోగ్య మంత్రిగా పదవీకాలం పూర్తైన తర్వాత, ప్రభుత్వ ఆదేశాలు లేఖ నం. 2290 తేదీ 05-12-2023 ఆదేశాల ప్రకారం, ఆ ఆఫీస్ను తర్వాత రోజు 06-12-2023 రోజున మూసివేసి, సిబ్బందిని పంపేశాం. ఆ రోజు నుంచి నరేష్ అనే వ్యక్తితో హరీశ్ రావు కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు. అయితే ఆఫీసు మూసివేసే క్రమంలో ఎలాంటి సమాచారం లేకుండా కొన్ని సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన వెంట తీసుకువెళ్లినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై వెంటనే మా కార్యాలయం స్పందించి, నరేష్ అనే వ్యక్తిపై 17-12-2023 నాడు, నార్సింగి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాం. చట్ట ప్రకారం, తగు చర్యలు తీసుకోవాలని కోరాం. కాబట్టి, ఆ వ్యక్తితో హరీశ్ రావుకి గానీ, కార్యాలయానికి గాని ఎలాంటి సంబంధం లేదు. ఈ వాస్తవాలు గుర్తించకుండా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పును, మొత్తం కార్యాలయానికి వర్తింపచేయడం బాధాకరం. ఎంతో మంది అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మా కార్యాలయం సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాకుండా, ఎన్నో విధాలుగా సహాయంపడింది. ఈ విషయం అందరికి తెలిసిందే. వాస్తవాలు గుర్తించాలని కోరుతున్నాం." అంటూ ప్రకటన రిలీజ్ చేశారు.

## ఇడుపుల పాయలో

# వైఎస్ విజయమ్మ, జగన్ ప్రార్ధనలు

**కడప :** వైఎస్ విజయలక్ష్మి రాజకీయంగా తన కుమారుడి వైపే ఉన్నారని పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరిన తర్వాత ఒక్క సారి కూడా షర్మిలతో కనిపించని విజయమ్మ.. సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభం సందర్భంగా ఇడుపుల పాయలో వైఎస్ సమాధికి నివాళి అర్పించేందుకు జగన్ కలిసి వచ్చారు. ప్రార్థనలు చేశారు. ఈ పరిణామంతో విజయమ్మ కుమారుడు జగన్ వైపే ఉన్నట్లుగా రాజకీయంగా సంకేతాలు వెళ్లినట్లే అనుకోవచ్చు.రాజకీయంగా విజయలక్ష్మి తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని ఇటీవల పరిణామాలు నిరూపిస్తున్నాయి. కుమార్తె తెలంగాణలో పార్టీ పెట్టుకున్న తర్వాత పూర్తిగా షర్మిలకే అండగా నిలిచారు. తెలంగాణలో షర్మిలకు అండగా ఉండటానికే అంటూ వైఎస్ఆర్సీపీ గౌరవ అధ్యక్షురాలిగా రాజీనామా చేశారు.

తెలంగాణకు వెళ్లారు. అక్కడ షర్మిల చేసిన పోరాటాల్లో తాను కూడా పాల్గొన్నారు. షర్మిలను అరెస్టు చేసినప్పుడు పోలీసులపై తీవ్ర విమర్శలు చేశారు కూడా.గతంలో వైఎస్ఆర్సీపీ గౌరవ అధ్యక్షురాలి పదవికి రాజీనామా చేసినప్పుడు కుమారుడు ఏపీలో , కుమార్తె తెలంగాణలో రాజకీయాలు చేస్తారని.. ఇది దైవ సంకల్పమన్నారు. అయితే షర్మిల తన రాజకీయ పయనాన్ని అనూహ్యంగా మార్చుకున్నారు. ఆమె తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడమే కాకుండా .. ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ విషయంలో షర్మిలకు తల్లి సపోర్ట్ ఉందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. కానీ విజయమ్మ మాత్రం.. షర్మిలతోనే ఉంటున్నారు. షర్మిల కుమార్తె పెళ్లికి .. రిసెప్షన్కు సీఎం జగన్ తో పాటు కుటుంబ సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. కానీ విజయమ్మ మాత్రం వెళ్లారు.విజయమ్మ ఏపీలో షర్మిల కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఎక్కడా కనిపించలేదు. పార్టీలో చేరే సమయంలో.. తర్వాత వివిధ సందర్భాల్లో ఇడుపుల పాయకు నివాళులు అర్పించేందుకు వెళ్లిన సమయంలోనూ కనిపించలేదు. అంటే.. రాజకీయంగా షర్మిల అడుగులకు .. విజయమ్మ మద్దతు ఇవ్వలేదని అనుకోవచ్చు. తాజాగా జగన్ వెంట.. రాజకీయ కార్యక్రమం ప్రారంభోత్సవానికి వెళ్లడంతో.. రాజకీయంగా తన మద్దతు జగన్ కే.. కుమారుడికే అని చెప్పినట్లయిందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. వైఎస్ విజయలక్ష్మి ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొనే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే షర్మిలకు మొదటి సారి ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతుంది.

## జిల్లాలో ఇప్పటివరకు

# రూ. 2,57,05,390/- ల నగదు పట్టివేత

**- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్**



**హైదరాబాద్** జిల్లాలో ఎన్నికల ఎన్ ఫోర్స్మెంట్ బృందాల ద్వారా ఇప్పటివరకు రూ.2,57,05,390 నగదు, రూ.37,05,841 విలువైన ఇతర వస్తువులు,1386.28 లీటర్ల అక్రమ మద్యంను సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుండి బుధవారం ఉదయం ఆరు గంటల వర కు నిర్వహించిన తనిఖీలలో రూ. 16,19,000 నగదుతో పాటు రూ.1,81,689 విలువ గల ఇతర వస్తువులు, 49.37 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అందులో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు రూ.69,000/- , పోలీస్ అధికారులు 15 లక్షల 50వేల రూపా యిల నగదును, రూ.1,81,689 విలువైన ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధి కారి తెలిపారు. 13 మంది పై ప్రోహిబిషన్ కేసులు నమోదు చేసి,13 మందిని అరెస్టు చేసిన ట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు నగదు, ఇతర వస్తువుల పై 156 ఫిర్యాదులు అందగా పరిశీలిం చి పరిష్కరించారని, 124 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసినట్లు రోనాల్డ్ రోస్ పేర్కొన్నారు.

# కూలీల ట్రాక్టర్ బోల్తా..

**- పలువురికి గాయాలు..**



**ములుగు** ములుగు జిల్లా కన్నాయి గూడెం మండలం బట్టాయిగుడెం లో మిర్చి కూలీల ట్రాక్టర్ బోల్తా పడింది.ఘటనలో 15 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఐదుగురి పరిస్తితి విషమంగా మారింది. వారిని ఏటూరు నాగారం ఆసుపత్రికి తరలించారు.

# జగన్ యుద్ధ భేరీ, తోడుగా తల్లి విజయమ్మ

ప్రొద్దుటూరు (ప్రశ్న న్యూస్) బాబాయ్‌ను ఎవరు చంపారో ఎవరు చంపించారో ఆ దేవుడికి కడప జిల్లా ప్రజలకు బాగా తెలుసుని ప్రొద్దుటూరు ఎన్నికల ప్రచారసభలో సీఎం జగన్ వ్యాఖ్యానించారు. వివేకా చిన్నాన్నను అతిదారుణంగా చంపి అతిహీనంగా బహిరంగంగా ఆ హంతకుడు తిరుగుతున్నాడని ఆ హంతకుడికి మద్దతు ఎవరిస్తున్నారో అంతా చూస్తున్నారని అన్నారు. ఆ చంపినోడు ఉండాల్సింది జైల్లో, నేరుగా నెత్తిన పెట్టుకుని మద్దతు ఇస్తోంది చంద్రబాబు, చంద్రబాబుకి సంబంధించిన వారేనని. చంద్రబాబుకు రాజకీయ లబ్ధి కోసం తపించి పోతున్న ఒకరిద్దరు తన వాళ్లు అన్నారు. చిన్నాన్నను అన్యాయంగా చంపారు. ఇంతటి దారుణం చేస్తూ నన్ను దెబ్బ తీసే రాజకీయం చేస్తున్నారు, ఇది కలియుగం కాకపోతే ఇంకేంటి? అని జగన్ ప్రశఅనించారు. ఇంత కన్నా అన్యాయం ఉంటుందా? మీ అందరి ప్రేమానురాగాల మధ్య నిల్చొని. ప్రజల మద్దతు లేని చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయం నేను మాత్రం ప్రజల పక్షం అని గర్వంగా చెబుతున్నానన్నారు. ఎన్నికలయ్యాక మేనిఫెస్టో చెత్త బుట్టలో పడేసే వ్యక్తి చంద్రబాబు అన్నారు. శవరాజకీయాలు, కుట్రలు ఆయనకు అలవాటు కుట్రలు చాలవన్నట్లు నా చెల్లెలిద్దరిని తీసుకొచ్చుకున్నారని ఆరోపించారు.ఆ దేవుడు, ఆ ప్రజల్నే నమ్ముకున్నా ధర్మం, న్యాయాన్ని నమ్ముకున్నానని జగన్ అన్నారు. పేదల ఇంటింటి అభివృద్ధికి అడ్డుపడుతున్నా ఈ దుష్ట చతుష్టయాన్ని చిత్తుగా ఓడించేందుకు పాంచజన్యం పూరించేందుకు శ్రీకృష్ణుడిలా మీరంతా సిద్ధమేనా అని జగన్ ప్రశఅనించారు. మే 13న ఫ్యాన్ మీద రెండు ఓట్లు వేసి మరో వంద మందికి చెప్పి ఓట్లు వేయించి మనందరి పార్టీని గెలిపించేందుకు, అభివృద్ధి నిరోధకులను పేదల వ్యతిరేకులను ఓడించేందుకు మీరంతా సిద్ధమేనా అని ప్రజల్ని అడిగారు. వైఎస్సార్ జిల్లా నేలమీద, ఈ పొద్దుటూరు గడ్డమీద, నన్ను మీ బిడ్డగా భావించి నిరంతరం కాపాడుకుని ఎవరు ఎన్ని కష్టాలు పెట్టినా వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ఎన్ని సమస్యలు సృష్టించినా నన్ను కాపాడుకున్న మీకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాన్నారు.

ఈ రోజు నా ముందు కనిపిస్తున్న స్థాయిలో ఈ జిల్లాలో ఎప్పుడూ సమావేశం జరిగి ఉండదు. ఓ మహా సముద్రం కనిపిస్తోంది. మంచికి మద్దతు పలికే ఇంతటి మహా ప్రజా సైన్యం మధ్య మన ప్రజా జైత్రయాత్రకు ముందు వరసలో మన వైఎస్సార్‌సీపీ పార్టీ జెండా తలెత్తుకుని ఎగురుతోంది ఇక్కడేనని తెలిపారు. అధికారాన్ని పేదల భవిష్యత్తు కోసం రైతులు, అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, భావితరాలు, మన గ్రామాలు, ఇంటింటి అభివృద్ధి, సంక్షేమం కోసం ఒక బాధ్యతగా ఈ 58 నెలల పాలనలో ప్రతి రంగంలోనూ విప్లవానికి మారుపేరుగా మార్పులు తీసుకొచ్చాం. ఎప్పుడూ జరగని విధంగా రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా రూ.2.70 లక్షల కోట్ల రూపాయలు లంచాలు, వివక్ష అనేవి లేకుండా నేరుగా ప్రజల చేతుల్లో ఉంచి ప్రజా ప్రభుత్వ అజెండా ఇక్కడ కనిపిస్తున్న మన జెండా అని స్పష్టం చేశారు. డ్రగ్స్ కేసుపైనా సీఎం జగన్ స్పందించారు. చంద్రబాబు వదినగారి చుట్టం తన కంపెనీకి డ్రై ఈస్ట్ పేరుతో డ్రగ్స్ దిగుమతిచేస్తావుంటే సీబీఐ వాళ్లు రెయిడ్ చేశారు. ఈ రెయిడ్ జరిగిందని తెలిసిన వెంటనే యెల్లో బ్రదర్స్ ఉలిక్కి పడ్డారు. దొరికితే తమ బ్రదర్ కాదని మన బ్రదర్ అని మన మీద నెట్టేసే యత్నం చేశారని ఆరోపించారు. ఈ జెండా తలెత్తుకుని ఎగురుతోంది అని రాష్ట్రంలో ఎ?క్కడికి వెళ్లినా, చూసినా కోట్ల గుండెలు, మన పార్టీకి, ప్రభుత్వానికి మద్దతు పలుకుతూ 2024 ఎన్నికల సమరానికి సిద్ధం అంటున్నాయి!కాబట్టే ఈ జెండా మరే ఇతర జెండాతోనూ జతకట్టడం లేదని స్పష్టం చేశారు.

# కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

చేసింది. ఈ పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేసేందుకు ఏప్రిల్ 2 వ తేదీ వరకు ఈడీకి గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తదుపరి విచారణను ఏప్రిల్ 3 వ తేదీకి వాయిదా వేసింది. మద్యం పాలసీ కేసులో ఈడీ ఢిల్లీ సీఎంను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టును వ్యతిరేకిస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్ ఇచ్చేందుకు అంగీకరించలేదు. ఈడీకి నోటీసులు జారీ చేసిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తనను ఈడీ అరెస్టు చేసిన విధానం తప్పని ఢిల్లీ సీఎంను విడుదల చేయాలని అభిషేక్ మను సింఘ్వీ కోర్టును కోరారు. కేజ్రీవాల్‌కు మధ్యంతర ఉపశమనాన్ని కోర్టు పరిశీలిస్తుందని ప్రధాన పిటిషన్‌పై ఈడీకి నోటీసులు జారీ చేస్తున్నట్లు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తెలిపారు. కేజ్రీవాల్ మధ్యంతర ఉపశమనం కోరితే దాన్ని పరిశీలించవచ్చని కోర్టు పేర్కొంది. ఈడీ తరఫు న్యాయవాది ఎస్వీరాజు వ్యతిరేకిస్తూ సమాధానం ఇచ్చేందుకు సమయం కోవాలని కోరారు.

# హరీష్‌పై కాంగ్రెస్ ఔదార్యం

ఈ రేస్, అవుటర్ రింగ్ రోడ్డు ఒప్పందం వంటి వివాదాలు ఉండనే ఉన్నాయి. ఆయా వివాదాల విచారణల ముగింపు క్రమంలో కేసీఆర్, కేటీఆర్, పై కేసులు నమోదయ్యే అవకాశముందని కాంగ్రెస్ నేతలు హెచ్చరికలు చేస్తూ వస్తున్నారు. ఇక ఎస్ఐబీలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపులు తిరుగుతూ అంతిమంగా బీఆర్ఎస్ పెద్దలకు ముఖ్యంగా కేటీఆర్ లేక కేసీఆర్‌కు చుట్టుకునే అవకాశముందన్న ప్రచారం వినిపిస్తున్నది. ఇన్ని చిక్కులు కేసుల మధ్య ఒకే ఒక్క పేరు మాత్రం స్వచ్ఛంగా ఉంది. ఎందులోనూ పేరు బయటకు రావడంలేదు. ఆ పేరే హరీష్ రావు. హరీష్ రావుపై ఒక్క కేసు కూడా నమోదయ్యే సూచనలు కనిపించడం లేదు.

### పదేళ్ల పాటు కీలక మంత్రిగా పని చేసిన హరీష్ రావు

కేసీఆర్ ఫ్యామిలీలో బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు ఎంత కీలకమైన వ్యక్తో చెప్పాల్సిన పని లేదు. కొద్ది రోజులు తప్ప పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఆయన కీలక శాఖలు నిర్వహించారు. ప్రాజెక్టుల రీ డిజైనింగ్ జరిగింది హరీష్ రావు భారీ నీటి పారుదల మంత్రిగా ఉన్నప్పుడే. కాళేశ్వరం నిర్మాణం అప్పుడే ప్రారంభమయింది. అయితే రెండో సారి బీఆర్ఎస్ గెలిచిన తర్వాత ఆయనకు ఆలస్యంగా మంత్రి పదవి ఇచ్చారు కానీ నీటి పారుదల శాఖ ఇవ్వలేదు. అలాగని ఆయన ప్రమేయం లేదని అనలేరు. కానీ కాళేశ్వరం విషయంలో కానీ మరో అంశంలో కానీ హరీష్ రావు అక్రమాలకు పాల్పడ్డారన్న వార్తలు కానీ ఆరోపణలు కానీ లీకులు కానీ ప్రభుత్వం నుంచి రావడం లేదు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కానీ ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం నుంచి కానీ ఇలాంటి సమచారం లేదు.

### కేసులు పెట్టకుండా హరీష్‌ను వ్యూహాత్మకంగా టార్గెట్ చేస్తున్నారా.?

హరీష్ రావు మాత్రమే ఎందుకు సేఫ్ గా ఉంచుతున్నారన్నది రాజకీయవర్గాలకు సస్పెన్స్‌గా మారింది. హరీష్ రావు కు కేసీఆర్ ఎంత చెబితే అంత. పార్టీలో తనకు ప్రాధాన్యం తగ్గిందన్న భావన వచ్చినప్పుడు కూడా ఆయన ఒక్క మాట కూడా వ్యతిరేకంగా అసంతృప్తిగా మాట్లాడలేదు. కానీ ఆయనపై సోషల్ మీడియాలో ఎన్ని పుకార్లు వచ్చాయో చెప్పడం కష్టం. బీజేపీలో చేరిపోతారని ఓ సారి సొంత పార్టీని చీలుస్తారని చాలా సార్లు ప్రచారం జరిగింది. కానీ హరీష్ ఎప్పుడూ వాటిపై స్పందించి అనవసర రచ్చ చేయలేదు. కానీ హరీష్ రావును బీఆర్ఎస్ పార్టీకి దూరం చేయడమో లేకపోతే ఆ పార్టీలో చిచ్చు పెట్టడానికి ప్రయత్నించేలా చేయడమో చేయాలన్న వ్యూహం ఇతర పార్టీలు అమలు చేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే భాగంగాన ఆయనపై కేసుల నీడ పడకుండా చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఈ పరిస్థితి హరీష్ రావుకు కూడా సవాల్ లాంటిదే. ఆయన ఏ మాత్రం బ్యాలెన్స్ తప్పినా ప్రత్యర్థి పార్టీల వ్యూహం ఫలించే అవకాశం ఉంటుంది.

# ఏపీ బీజేపీ అభ్యర్థుల ప్రకటన

విశాఖపట్నం నార్త్- పీ విష్ణుకుమార్ రాజు, అరకు (ఎస్టీ రిజర్వుడ్)- పంగి రాజారావు, అనపర్తి- శివ కృష్ణంరాజు, కైకలూరు- కామినేని శ్రీనివాసరావు, విజయవాడ వెస్ట్- సుజనా చౌదరి, బద్వేలు (ఎస్సీ రిజర్వుడ్)- బొజ్జా రోశన్న, జమ్మలమడుగు- సీ ఆదినారాయణరెడ్డి, ఆదోని- డాక్టర్ పీవీ పార్థసారథి, ధర్మవరం- వై సత్యకుమార్‌కు టికెట్ లభించింది. ఈ జాబితాలో బీజేపీ రాష్ట్రశాఖ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి సహా మరికొందరు ఆశావహుల పేర్లు లేకపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది కాస్త పార్టీలో తీవ్ర చర్చనీయాంశమౌతోంది. అసలు సిసలు బీజేపీ నాయకులకు టికెట్లు లభించకపోవడం పట్ల అసంతృప్త వాతావరణం నెలకొంది. నిజానికి- తూర్పు గోదావరి జిల్లా అనపర్తి అసెంబ్లీ సీటు టికెట్‌ను సోము వీర్రాజుకు కేటాయిస్తారనే ప్రచారం జరిగింది గానీ అది వాస్తవ రూపం దాల్చలేదు. అనపర్తి టికెట్‌ను శివ కృష్ణంరాజుకు కేటాయించారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడే అయినప్పటికీ- ఆ ఓటుబ్యాంకు బలంగా ఉన్న చోట సోముకు టికెట్ దక్కలేదు. 2004లో సోము వీర్రాజు ఎన్నికల బరిలో నిల్చొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి కడియం స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు గానీ గెలవలేకపోయారు. కాంగ్రెస్‌కు చెందిన జక్కంపూడి రామ్మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. రెండో స్థానానికి పరిమితం అయ్యారు. 2015లో శాసన మండలికి ఎన్నికయ్యారు. ఆ తరువాత ప్రత్యక్ష ఎన్నికల్లో పెద్దగా పోటీ చేయలేదు గానీ బీజేపీలో జాతీయ స్థాయిలో కీలక పదవులను పొందారు. పార్టీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పరిస్థితి కూడా దాదాపుగా ఇంతే. సుదీర్ఘకాలంగా పార్టీలో ఉంటూ వచ్చినప్పటికీ- ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్ దక్కించుకోలేకపోయారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి ఆయన సొంత నియోజకవర్గం. పొత్తులో భాగంగా ఈ స్థానంలో టీడీపీ పోటీ చేస్తోంది. కందికుంట యశోదా దేవికి టికెట్ ఇచ్చింది.

# దానం నాగేందర్‌పై హైకోర్టులో మరో పిటిషన్

చేయకుండా మరో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేయడం చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ మేరకు దానంపై అనర్హత వేటు వేయాల్సిందిగా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరాడు. కాగా ఈ పిటిషన్ నేడు విచారణకు వచ్చే ఛాన్స్ ఉంది. కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రెండు వారాల క్రితం కారు పార్టీకి షాక్ ఇస్తూ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన రెండ్రోజులకే దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇక్కడి నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పోటీ చేస్తుండగా బలమైన అభ్యర్థిని దింపాలనే యోచనలో బీసీ సామాజిక వర్గానికి చెందిన దానంను కాంగ్రెస్ బరిలోకి దింపుతోంది. బీఆర్ఎస్ నుంచి సికింద్రాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ పోటీ చేస్తున్నారు.కాగా, ఆయన పార్టీ మారటంపై ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని.. దానంపై అనర్హత వేటు వేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలోని బృందం స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఇష్యూ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉండగానే తాజాగా మరో వ్యక్తి దానంపై ఫిర్యాదు చేయటం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా దానం నాగేందర్‌కు మరో కేసులో హైకోర్టు ఇది వరకే నోటీసులు జారీ చేసింది. దానం ఎన్నిక చెల్లదంటూ ఆయన ప్రత్యర్థి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇటీవల విచారణ జరిపింది. జస్టిస్ విజయసేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. దీనిపై దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఓటర్లకు డబ్బులు పంచారని, ఈ విషయంలో కేసులు కూడా నమోదయ్యాయని కోర్టుకు వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం దానంకు నోటీసులు జారీ చేసింది. ఇలా పార్లమెంట్ ఎన్నికల వేళ దానంకు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలు కాగా అనర్హత వేటు వేసేలా హైకోర్టు స్పీకర్‌ను ఆదేశిస్తుందా.? అనేది హాట్ టాఫిక్‌గా మారింది.

# తెలంగాణ కాంగ్రెస్‌లో తెగని టిక్కెట్ల పంచాయతీ

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క్ భార్య నందిని పోటీ పడుతున్నారు. మెదక్ నుంచి నీలం మధు పోటీకి ప్రయత్నిస్తున్నారు.

### ఖమ్మం, భువనగిరి టిక్కెట్ల పంచాయతీ ఇప్పుడల్లా తేలుతుందా.?

ముఖ్యంగా ఖమ్మం, భువనగిరి టిక్కెట్ల విషయంలో చాలా తీవ్రమైన పోటీ ఉంది. ఖమ్మం నుంచి ప్రసాద్ రెడ్డి, నందినిలలో ఎవర్ని ఎంపిక చేసిన మరొకరు తీవ్ర అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంది. ఇద్దరు సీనియర్ మంత్రుల కుటుంబసభ్యులు కావడమే దీనికికారణం. రేసులో ఎక్కువమంది ఉండడంతో చివరి క్షణంలో అభ్యర్థులను మార్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. ఇప్పటికే తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థుల్ని ప్రకటించాయి. కాంగ్రెస్ మాత్రమే పెండింగ్ అభ్యర్థుల్ని ఖరారు చేయాల్సి ఉంది. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ హిందూ అభ్యర్థిని ప్రకటించింది. మజ్లిస్ కు మేలు చేసేందుకు ఇలా చేసిందని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం అభ్యర్థిని పెడుతుందా లేక మజ్లిస్ కు సహకరిస్తుందా అన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

### రేవంత్ ఆధ్వర్యంలో ప్రచారం వ్యూహం

మరోవైపు ప్రచార వ్యూహంపై ఈనెల 29న శుక్రవారం సాయంత్రం గాంధీ భవన్‌లో పీసీసీ కమిటీ భేటీ కానుంది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు, సీనియర్ నేతలు హాజరుకానున్నారు. మరోవైపు ఎన్నికల హీట్ పెరుగుతుండడంతో ముఖ్యమంత్రి గాంధీభవన్‌కు వచ్చి నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# చేనేత కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్

చేసిందని తెలిపారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు దివంగత నేత ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని, ఆ ప్రాజెక్టులను తాను మరింత అభివృద్ధి చేశానని తెలిపారు. నీళ్లు వస్తే పరిశ్రమలు వస్తాయి.. నీళ్లు వస్తే అభివృద్ధి జరుగుతుందని చంద్రబాబు తెలిపారు. జగన్ సిద్ధం అంటూ మరో మోసపూరిత యాత్రకు వస్తున్నారని.. ఆయనకు ఖాళీ రోడ్లతో స్వాగతం పలకాలని సూచించారు.

### రాష్ట్రానికి విముక్తి కలిగించే రోజు మే 13

జగన్ రాయలసీమ ద్రోహి అని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. తమ వద్దకు రావడానికి వీలులేదని ప్రజలంతా జగన్‌కు చెప్పాలన్నారు. ఏపీని జగన్ సర్వ నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు మార్చే రోజు మే13వ తేదీ కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఆరోజుతో రాష్ట్రానికి పట్టిన జగన్ అనే శని వదిలిపోతుందని తెలిపారు. జే బ్రాండ్ మద్యం, గంజాయి నుండి రాష్ట్రానికి విముక్తి కలిగించే రోజు మే 13 అవుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

### జగన్ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ఉద్యోగస్తులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం లేదని, పెన్షనర్లకు ఒకటో తేదీన పెన్షన్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఒకప్పుడు రాయలసీమ రత్నాల సీమగా ఉండేదని, రాయలవారు ఏలిన ప్రాంతాన్ని జగన్ సర్వనాశనం చేసారన్నారు. నాడు దివంగత నేత ఎన్టీఆర్ రాయలసీమను సస్యశ్యామలం చేశారన్నారు. కరువు సీమగా ఉన్న రాయలసీమలో అన్ని రంగాలను తాను సీఎంగా ఉన్నప్పుడు అభివృద్ధి చేశానని చంద్రబాబు తెలిపారు. పరదాల వీరుడు జగన్ నేడు ముసుగులతో బస్సుయాత్ర మొదలుపెట్టారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెరగవని హామీ ఇచ్చారు.

# వేలంలో రూ. 40 కోట్లు పలికిన నెల్లూరు ఆవు

బాగా ప్రసిద్ధి. ఈ జాతికి చెందిన ఆవులకు బాగా డిమాండ్ కూడా ఉంటుంది. ఇలా మన భారతదేశంలో ప్రసిద్ధి చెందిన ఈ మేలుజాతి ఆవులు ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. దీనికి కారణం ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన ఓ వేలంలో నెల్లూరు జాతికి చెందిన ఓ ఆవు ఏకంగా రూ. 40 కోట్లు పలకడమే. దీంతో భారతదేశానికి చెందిన ఈ మేలుజాతి ఆవు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఆవుగా మారింది. వయాటినా-19 ఎఫ్ఐవీ మారా ఇమోవిస్ అని పిలవబడే నెల్లూరు జాతికి చెందిన ఆవు ఏకంగా 4.8 మిలియన్ అమెరికన్ డాలర్లకు (సుమారు రూ. 40 కోట్లు) అమ్ముడుపోయింది. ఇక ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన ఈ మేలురకపు ఆవులను 1868లోనే బ్రెజిల్‌కు తరలించడం జరిగింది. ఆ తర్వాత ఈ రకపు జాతి ఆవులు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ఇక ఈ జాతికి చెందిన ఆవులు ఒక్క బ్రెజిల్ దేశంలోనే 16 మిలియన్ల వరకు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. తెలుపు రంగులో ఉండి, చూడటానికి బలిష్టంగా కనిపించే ఈ మేలురకపు ఆవులు వేడి ప్రదేశాలలోనూ ఇమిడిపోగలవు. అంతేగాక వీటిలో వ్యాధి నిరోధక శక్తి కూడా అధికంగానే ఉంటుంది. కాగా, ఈ జాతి ఆవు శాస్త్రీయ నామం 'బోస్ ఇండికస్'

# నీకు దమ్ముంటే మనమిద్దరం పోటీ చేద్దాం

శూన్యంలో నుంచి సునామీ పుట్టించిన నాయకుడు కేసీఆర్‌ను పట్టుకొని మాట్లాడుతుంటే మీకు ఎంత బాధ ఉందో మాకు అంతే ఉందని కేటీఆర్ తెలిపారు. గ్రేటర్ పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గాల సమీక్షల్లో కేటీఆర్ పాల్గొన్నారు. మల్కాజ్‌గిరిలో జరిగే పోటీ కేవలం వ్యక్తుల మధ్య కాదు పోటీ మూడు పార్టీల మధ్య. కేసీఆర్ నిలబడ్డారని భావించి పని చేయాలి. అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ నియోజకవర్గం పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో తుఫానులా మెజార్టీ ఇచ్చారు. మూడు లక్షల యాభై ఓట్ల మెజార్టీ వచ్చింది. కాబట్టి ఇప్పుడు ఇతర పార్టీలు మూడున్నర లక్షలు దాటి ముందుకు వచ్చి గెలవాలి. అయినా కూడా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలి. కార్పొరేట్ ఎన్నికల్లో మాదిరిగానే ప్రతి ఇంటికి వెళ్లాలి.

దేశంలోనే అత్యంత పెద్ద నియోజకవర్గం మల్కాజ్‌గిరి. కాబట్టి ప్రతి వాడ తిరిగి ప్రచారం చేయాలి. రాగిడి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు బ్రహ్మాండంగా ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు.కాంగ్రెసోళ్ల మాటలు వింటుంటే రక్తం మరుగుతది. హైదరాబాద్‌లో తన్నినట్లే మరోసారి మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్లలో జాడిచ్చి తన్నాలని పిలుపునిచ్చారు. దాంతో వారి నోరు మూత పడవాలి. అడ్డమైన కారు కూతలు మూతపడాలంటే కారు వంద కిలోమీటర్ల వేగంతో ఉరకాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మనిషా.? రాహుల్ మనిషా.? మోదీ మనిషా.? అర్థం కావడం లేదు. నరేంద్ర మోదీ దొంగ అని రాహుల్ అంటే, రేవంతేమో మోదీ బడే బాయ్ అంటడు. రాహుల్ గాంధీ అదానీ ఫ్రాండ్ అంటుంటే అదానీ హమారే ఫ్రెండ్ అంటుండు రేవంత్. గుజరాత్ మోడల్ ఫేక్ అని రాహుల్ అంటుంటే రేవంత్ రెడ్డేమో తెలంగాణను గుజరాత్ మోడల్ చేస్తా అంటుండు. మైనార్టీల కొపంలు పుచ్చుకుని, బుల్డోజర్లతో ఇండ్లు కూలగొట్టి, దిక్కుమాలిన పనులు చేసి హిందూ %--% ముస్లిం ఫీలింగ్ తెస్తావా.? లిక్కం స్కాం లేదు మన్ను లేదు అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం తప్పు అని రాహుల్ అంటడు రేవంత్ రెడ్డేమో కవితను అరెస్టు చేయడం కరెక్ట్ అని అంటడు. అసలు రేవంత్ ఎవరి మనషి.? ఆలోచించాల్సిన అవసరం ఉన్నది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక్క ఓటు రేవంత్ రెడ్డి పార్టీకి వేసినా అది అల్టిమేట్‌గానే బీజేపీకి లాభం అయితది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలోకి జంప్ అవుతాడు. ఈ మాట అన్నప్పుడు రేవంత్ ఖండించడం లేదు. ఆయన మొదట ఏబీవీపీలో ఉన్నారు. ఆ తర్వాత టీఆర్ఎస్, అక్కడ్నుంచి టీడీపీ, కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మళ్లీ మాతృసంస్థ బీజేపీలోకే పోతడు. పచ్చి అవకాశవాది రేవంత్ రెడ్డి ఆయనకు మరో ఎజెండా లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తెలంగాణలో మళ్లీ కొత్త జిల్లాలు.?

చేశారు. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే జిల్లాల స్వరూపాన్ని మార్చేస్తామనే దిశగా సంకేతాలిచ్చారు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల విభజన, మండలాల పునర్విభజనపై ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని సీఎం పగ్గాలు చేపట్టిన తొలి నాళ్లలో రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ కమిషన్ అధ్యయనం ప్రకారం కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

### జిల్లాలుగా లోక్ సభ స్థానాలు.?

అయితే తెలంగాణలో 17 లోక్ సభ నియోజకవర్గాలను జిల్లాలుగా ఏర్పాటు చేసే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. అంటే ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలను కాస్తా 17కి కుదిస్తారు. జిల్లాల సంఖ్య తగ్గించడం మంచి ఆలోచనే కావచ్చు కానీ లోక్ సభ నియోజకవర్గాలను జిల్లాలుగా మార్చడం ద్వారా కొత్త సమస్యలు తలెత్తే అవకాశమూ లేకపోలేదు. ఉదాహరణకు మహబూబాబాద్ లోక్ సభ స్థానాన్ని తీసుకుంటే ఈ నియోజకవర్గం పరిధిలో డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలను ములుగు జిల్లాలో కలిపారు.

### ఇలా చేస్తే మళ్లీ పాత సమస్యలే..

ఇప్పుడు మహబూబాబాద్ లోక్ సభ స్థానాన్ని జిల్లాగా మారిస్తే వాజేడు నుంచి మహబూబాబాద్ వెళ్లాలంటే 165 కి.మీ. ప్రయాణించాలి. భద్రాచలం, మహబూబాబాద్ మధ్య దూరం 110 కి.మీ. పైనే ఉంటుంది. ఇది ఖమ్మం, భద్రాచలం పట్టణాల మధ్య ఉన్న దూరానికి దాదాపు సమానం. ఇలాంటి సందర్భాల్లో జిల్లాల విభజనకు అర్థం గానీ, దాని వల్ల వచ్చే ప్రయోజనం కానీ ఉండదు. జిల్లాలను పునర్విభజించే యోచనలో గనుక ప్రభుత్వం ఉంటే పార్లమెంట్ నియోజకవర్గాలను జిల్లాలుగా మార్చడమే కాకుండా జిల్లా కేంద్రం నుంచి జిల్లాలోని చివరి మండలానికి ఉన్న దూరాన్ని పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

### డిమాండ్లకు అనుగుణంగా కొత్త జిల్లాలు..

కొత్త రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి తెలంగాణలో 10 జిల్లాలు ఉండగా.. కేసీఆర్ సర్కారు వాటిని 33 జిల్లాలుగా విభజించింది. కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు కొన్ని జిల్లాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఆరు గంటలకుపైగా ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఉమ్మడి ఖమ్మం జిల్లానే ఉదాహరణగా తీసుకుంటే ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న వెంకటాపురం నుంచి జిల్లా కేంద్రమైన ఖమ్మం వెళ్లాలంటే 240 కి.మీ. ప్రయాణించాలి. ఖమ్మం నుంచి హైదరాబాద్ కంటే ఇది 40 కి.మీ. ఎక్కువ దూరం. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త జిల్లాల ఏర్పాటుకు పూనుకున్న కేసీఆర్ ప్రభుత్వం స్థానికుల నుంచి వచ్చిన డిమాండ్లను కాదనలేక జిల్లాల సంఖ్యను 33కు పెంచుకుంటూ పోయింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను 4 జిల్లాలుగా విభజించడమే దీనికి మంచి ఉదాహరణ. ఇప్పుడు అవసరం లేని చోట జిల్లాలను తగ్గించి అవసరమని భావించిన చోట కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తే అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి ప్రయోజనకరంగా ఉంటుంది.

### ఏపీలో గందరగోళంగా మారిన జిల్లాల ఏర్పాటు..

ఏపీలోనూ జగన్ సర్కారు 13 జిల్లాలను ఇలాగే 26 జిల్లాలుగా మార్చింది. అక్కడ కూడా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దంకి నుంచి ఒంగోలుకు గంటలోపే చేరుకోవచ్చు కానీ దాన్ని బాపట్ల జిల్లాలో కలిపారు. దీంతో అద్దంకి నుంచి కొత్త జిల్లా కేంద్రమైన బాపట్ల వెళ్లాలంటే రెండు గంటలు ప్రయాణించాల్సిన పరిస్థితి. అంతే కాదు పాడేరు కేంద్రంగా ఏర్పాటైన అల్లూరి జిల్లాలో ఎటపాక రెవెన్యూ డివిజన్‌ను కలిపారు. ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాలు ఉన్నాయి. ఒకప్పుడు ఇవన్నీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భాగంగా ఉండేవి. కూనవరం నుంచి పాడేరు వెళ్లాలంటే 250 కి.మీ. ప్రయాణించాలి. అందులో చాలా వరకు ఘాట్ రోడ్డే. ఇక్కడ గమనించాల్సి విషయం ఏంటంటే కూనవరం నుంచి రాజమండ్రి మధ్య దూరం 170 కిలోమీటర్లే, అంతే కాదు కనెక్టివిటీ కూడా ఎక్కువ.

# ఛత్తీస్ ఘడ్‌లో భారీ ఎన్ కౌంటర్

**రాయ్ పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నక్సలైట్‌లు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. అఖీఖఈ జవాన్లు, మావోలకు మధ్య ఉదయం నుంచి కాల్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆరుగురి మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో ఇద్దరు మహిళా నక్సలైట్ ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

తల్పేరు నదీ సమీపంలో ఈ కాల్పులు జరిగాయి. యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో భాగంగా అఖీఖఈ జవాన్లతో పాటు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, కోబ్రా సిబ్బంది నక్సల్స్‌పై కాల్పులు జరిపారు.కి చెందిన నక్సలైట్‌లు అక్కడే ఉన్నారన్న సమాచారం అందుకున్న సిబ్బంది అక్కడ నిఘా పెట్టారు. దాదాపు 10 మంది మావోయిస్ట్‌లు అక్కడే ఉన్నారు. వాళ్లపై కాల్పులు జరిపారు. అటు నక్సల్స్ కూడ ఎదురు కాల్పులకు దిగారు. ఉదయం నుంచి ఈ కాల్పులు కొనసాగాయి. కాసేపటికి రెండు వైపులా కాల్పులు ఆగిపోయాయి. ఆ తరవాత ఆరుగురు నక్సల్స్ మృతదేహాల్ని భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకుంది. మృతుల్లో ఇద్దరు మహిళలున్నారు. ఘటనా స్థలం నుంచి భారీ పేలుడు పదార్థాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల్లో మరి కొందరు నక్సల్స్ గాయపడి ఉంటారని వెల్లడించారు.

## దానం నాగేందర్ పార్టీ మారడంపై
# హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ తరఫున అసెంబ్లీ టికెట్‌పై విజయం సాధించిన దానం నాగేందర్ ఈ మధ్య కాలంలో కాంగ్రెస్( పార్టీలో చేరారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి గతేడాది జరిగిన ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీ చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో ఆయన ఈ మధ్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ రెడ్డి, దీప్‌దాస్‌మున్షీ నేతృత్వంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున విజయం సాధించి ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీలో చేరడంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆయనపై అనర్హత వేటు వేయాలని రాజు యాదవ్ అనే వ్యక్తి పిల్ వేశారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి... రాజీనామా చేయకుండా పార్టీ మారడం చట్ట విరుద్ధమని అందుకే చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో రాజు పేర్కొన్నారు. దానంపై చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని హైకోర్టుకు విన్నవించారు. అనర్హత వేటు వేసేలా ఆదేశాలు ఇవ్వాలని రిక్వస్ట్ చేశారు.

దీన్ని విచారణకు హైకోర్టు అంగీకరించింది. ఈ పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది. కారు గుర్తుపై ఖైరతాబాద్ నుంచి విజయం సాధించిన దానం నాగేందర్... ఈ మధ్య కాలంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన చేరిన తర్వాత సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. దీన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా తప్పుపడుతున్నారు. అవకాశ వాదులకు పదువులు ఇవ్వడం మంచి సంకేతాలు కావని కామెంట్ చేస్తున్నారు. దానం చేరిక అటు కాంగ్రెస్ ఇటు బీఆర్ఎస్‌లో కూడా విమర్శలు కారణమైంది. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై రివ్యూ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం తీవ్ర విమర్శలు చేశారు. దానం నాగేందర్ పచ్చి అవకాశవాది అని ఆరోపించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉండే వాళ్లే నిజమైన నాయకులు అని అధికారంలో ఉన్నప్పుడు ఎంజాయ్ చేయడానికి వచ్చి వెళ్లిపోయే వాళ్లను ప్రజలు నమ్మబోరని అన్నారు.

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసే వరకు పోరాడుతామన్నారు కేటీఆర్. స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే కోర్టుల్లో కేసులు వేస్తామన్నారు. కచ్చితంగా ఆయనపై అనర్హత వేటు పడుతుందని చెప్పుకొచ్చారు కేటీఆర్. కేటీఆర్ చేసిన విమర్శలపై దానం నాగేందర్ కూడా ఘాటుగా రియాక్ట అయ్యారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి తప్పుడు పనులే చేయలేదని అలా అని నిరూపించాలని సవాల్ చేశారు. కేసీఆర్ గొప్ప నాయకుడేనని కానీ ఆయన పక్కన ఉన్న వాళ్లే చెడగొడుతున్నారని కామెంట్ చేశారు.

# సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**ఎమ్మిగనూరు** కర్నూలు జిల్లా ఎమ్మిగపట్నంలో 29వ తేదీ శుక్రవారం రోజున సాయంత్రం నాలుగు గంటలకు జరుగు సిద్ధం బహిరంగ సభను సీఎం జగన్ రాబోతున్న అందులో భాగంగా వైడబ్ల్యుసి గ్రౌండ్లో సిద్ధం బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. జిల్లా నలుమూల నుండి పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ఈ బహిరంగ సభ వైసిపి నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అందరూ కలిసి విజయవంతం చేయాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పిలుపునిచ్చారు

## రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకోబోతున్న ఓ యువకున్ని ప్రాణాలకు తెగించి రక్షించాడు

**- పోలీసు కానిస్టేబుల్ రవి**

**వరంగల్** వరంగల్ నగరంలోని అండర్ బ్రిడ్జి వద్ద చతిస్గడ్ రాష్ట్రానికి చెందిన సోను అనే యువకుడు కుటుంబ కలహాలతో రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు . ఆత్మహత్య చేసుకోవడానికి రైలు పట్టాలపై పడుకున్నాడు. అది గమనించి వరంగల్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న యర్ర రవి వెంటనే స్పందించి పట్టాలపై పడుకొని ఉన్న యువకుడుని పక్కకు లాగాడు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి. దీంతో రవిని ఉన్నత అధికారులు ప్రశంసించారు

## యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

- ఏప్రిల్ 1వ తేదీలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరుగకుండా కొనుగోళ్ళు జరపాలి



**జయశంకర్ భూపాలపల్లి, మార్చ్ 27;** యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు.బుధవారం కలెక్టరు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లు, వ్యవసాయ, సహకార, డిఆర్డీఏ, తూనికలు కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల తో 2023-24 యాసంగి ధాన్యం కొనుగోలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 189 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, సుమారు లక్ష 20 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికపుడు కేంద్రాల నుండి మిల్లులకు తరలించాలని తెలిపారు. నిబంధనల ప్రకారంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు ప్రతి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు దాన్యం కొనుగోలు ప్రక్రియ నడుస్తుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని, ఉల్లంగన జరిగితే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రజా ప్రతినిధులకు చెందిన ఫ్లెక్సీలు, ఫోటోలు లాంటివి లేకుండా చూసుకోవాలని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ,హమాలీలు వడ దెబ్బకు గురి కాకుండా టెంట్లు, షేడ్ నెట్ లు, చలువ పందిళ్ళు ఏర్పాటు చేసి నీడ ఉండేవిధంగా చూసుకోవాలని త్రాగునీరు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్యాడి క్లీనింగ్ మిషన్లను, తేమా శాతాన్ని కొలిచే మాయిచ్చర్ మిషన్లను, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. లీగల్ మెట్రాలజీ అధికారుల ద్వారా ధ్రువీకరణ పొందిన కాంటాలు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ లను ఉపయోగించాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రెండు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ఒక దానిలో నాణ్యత ప్రమాణాల గురించి , మరొక ఫ్లెక్సీలో అధికారుల ఫోన్ నెంబర్లు, అలాగే రైతులు పాటించవలసిన నిబంధనలు, పాటించకూడని నిబంధనలను సంబంధిత ట్రాన్స్పోర్ట్ నంబర్ ను తెలిపే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ విస్తీర్ణాన్ని బట్టి కొనుగోలు కేంద్రానికి కావలసిన గన్ని బ్యాగులను ముందే సిద్ధం చేసుకోవాలని కొనుగోలు కేంద్రం ఇన్చార్జులు ఏ రోజుకారోజు 16 పాయింట్ల తో కూడిన డాటాను తప్పక ఆన్లైన్ లో నమోదు చేయాలని తెలిపారు. టాగ్ చేసిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలని ట్యాగింగ్ లేని మిల్లులకు ధాన్యం తరలిస్తే కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లు కూడా ట్యాగ్ చేయక పోతే దిగుమతి చేసుకోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులూ ఉన్న వాట్సప్ గ్రూపు ద్వారా అధికారులకు తెలియజేయాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ కల్ల తప్పకుండా మండలానికి ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు బరోసా కల్పించాలన్నారు. రైతులు ధాన్యం వివరాలకు సంబంధించి ప్రతి కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు. వానా కాలం పంట కొనుగోలుని విజయవంతం గా నిర్వహించామని అదే స్ఫూర్తితో యాసంగి పంటను ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులు తమ సెల్ ఫోన్ నెంబర్లను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తాలు, తేమ, గులకరాలు, మట్టి లాంటివి లేకుండా నాణ్యత పాటించాలని రైతులకు రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాణ్యత కలిగిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతులు తమ వెంట పట్టాదార్ పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలను తీసుకువెళ్ళాలని సూచించారు. వ్యవసాయ అదికారులు క్రాఫ్ బుకింగ్ చేపట్టడం జరిగిందని దీని ద్వారా వ్యవసాయ శాఖ ఏ.ఈ.ఓ లు వారి ప్రాంతంలోని రైతులు పండించిన పంటల వివరాలను నమోదు చేశారని దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు జరపడానికి సులువుగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి రైతు వేదికలో, గ్రామపంచాయతీ లలో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు ట్యాగింగ్ లేకుండా ధాన్యాన్ని దించుకోకూడదని, గత సంవత్సరంకు సంబంధించిన స్టాకు మిల్లుల వద్ద ఉంటే వెంటనే వాటికి సంబందించిన వివరాలు తెలియజేయాలని మిగిలిన సిఎంఆర్ ను మే చివరి వరకు పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా రైతుల సమస్యల కోసం పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ఆ నంబర్ ను రైతులకు తెలియజేయాలని ప్రతి గ్రామ పంచాయతీ లలో, రైతు వేదికలలో పోస్టర్స్ అంటించాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైసుమిల్లులను ఆ మండలానికి సంబందించిన తాసిల్దార్, ఎంపిడివో, వ్యవసాయ అధికారులు ప్రతీ రోజు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. రైస్ రీసైక్లింగ్ అనేది జరగకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో ఏదైనా రైతు మద్దుతు ధర కంటే ఎవరైనా తక్కువ దరకు విక్రయించొద్దని, దళారుల బారిన పడి తక్కువకు విక్రయించొద్దని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్డీఓ నరేష్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రాఘవేందర్, పౌర సరఫరాల అధికారి నర్సింగ్ రావు, డిసిఓ శైలజ, వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, తూనికలు కొలతల అధికారి శ్రీలత, మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, రవాణా అధికారి సంధాని, కొనుగోలు కేంద్రాల ఇన్ ఇన్చార్జ్ లు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాగులమ్మ అమ్మ వారికి అభిషేకాలు



**అభిషేకాలు** నిర్వహించిన ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ములుగు :జిల్లాలోని మంగపేట మండలం వాగొడ్డు గూడెం గ్రామంలో వెలిసిన శ్రీ నాగులమ్మ అమ్మవారికి సుంకు పండగలో భాగంగా రెండోవ రోజు బుధవారం శ్రీ నాగులమ్మ మూల విరాట్ కు బాడిశ రామకృష్ణ స్వామిజీ పూజలు నిర్వహించి,వివిధ దళాలతో,పుష్పాలతో,పసుపు,కుంకుమ,తేనె గోదావరి పవిత్ర జలాలతో అభి షేకాలు నిర్వహించారు.అనం తరం ఆలయ ప్రాంగణంలో ఉన్న సమ్మక్క సారక్క, పగిడిద్దరాజు, ఘడికమారాజు, ఎర్రమ్మ,కంఖ నాగుల గద్దెల వద్ద పూజారులు,వడ్డెలు డోలు వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ నాగులమ్మ అమ్మవారికి సంబంధించిన ఏల్పుల జెండాలను అలం కరించి,ధూపాన్ని వేసి,జలకం పూజారి మడకం లక్ష్మయ్య జలకం జల్లుతూ పూజలు నిర్వహించారు.అనంతరం ఏల్పుల జెండాలను అమ్మ వారి ఆలయం చుట్టూ ప్రద క్షిణ చేసి గద్దె వద్ద వడ్డెలు, ఆర్తిబిడ్డల సారకలు(డోళ్లు) తో ఆడించారు.అంతకు ముందు రోజు రాత్రి 3 గంటల సమ యంలో(తెల్లవారితే బుధ వారం) మండే మెలుగు కార్యక్రమాన్ని పూజారులు వడ్డెలు నిర్వహించారు.పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామిజీ ఆధ్వర్యం లో నిర్వహించగా,పూజా రులు,వడ్డెలు బాడిశ నాగర మేష్,మడకం లక్ష్మయ్య,సోడి సత్యం,మూయబోయిన శివ,కుర్సం పుల్లయ్య,ఈసం సమ్మక్క,కోర్స శ్రీకాంత్,చౌలం భవానీ,కట్టం సమ్మక్క,తుర్స చిన్నాబ్బాయి,సోడి శ్రీను,ఇర్ప రామకృష్ణ,కొమరం ధనలక్ష్మి, కొమరం పాపరావు,ఆదివాసీ కుల పెద్దలు కుర్సం విష్ణు మూర్తి,మడకం రాజేశ్వర్ రావు,కోర్స ముసలయ్య,కారం సాంబయ్య,మడకం రమేష్, కుర్సం నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అడ్వకేట్ బర్ల సహదేవ్



**వర్ధన్నపేట** బుధవారం రోజున హనుమకొండ లోని జిల్లా కాంగ్రెస్ భవన్ లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధికార ప్రతినిధి శ్రీమతి సుజాత పౌల్ , పిసిసి అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి హాజరై వరంగల్ జిల్లా లో అధికార ప్రతినిధులను నియమించడం జరిగింది ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలం చేన్నారం గ్రామానికి చెందిన అంబేద్కర్ వాది అడ్వకేట్ బర్లా సహదేవ్ ను వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమించినట్లు తెలిపారు ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అడ్వకేట్ బర్ల సహదేవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ వాదాన్ని ముందుకు తీసుకెళ్లి అంబేద్కర్ సంఘాలలో క్రియాశీలక పాత్ర పోషించి మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాల్గొన్నందుకు సముచితమైన స్థానం కల్పించినందుకు ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పౌల్ కు,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వరరావు, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు కు, పిసిసి అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి లకు జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ నాకు ఇచ్చిన పదవీకి అంకితభావంతో పనిచేస్తూ ఈ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా వరంగల్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం నిరంతరం పనిచేస్తానని తెలియజేశారు.

## అధికారం కోసం చంద్రబాబు ఎవరి కాళ్లైనా పట్టుకుంటాడు

**గుడివాడ** గుడివాడ ఒకటవ వార్డులో ఎమ్మెల్యే కొడాలి నాని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుపై ఘాటు వ్యాఖ్యలు చేసారు.ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబు గాడిది కాళ్లైనా పట్టుకుంటాడు. అధికారం కోసం చంద్రబాబు ఏదైనా చేస్తాడని రాష్ట్రంలోని ముస్లిం, క్రిస్టియన్, హిందూ సోదరులందరికీ తెలుసు..... ఆయన వెనకాల ఉన్న తెలుగు తమ్ముళ్లకు..... పదిమంది జనసేనికులకు తప్ప. జూన్ 4 తర్వాత చంద్రబాబు పేరు తలుచుకునే వారెవరు రాష్ట్రంలో ఉండరు. ×అందితే జుట్టు.... లేదంటే కాళు పట్టుకునే వ్యక్తి చంద్రబాబు ×ఒంటరిగా పోటీ చేస్తే గెలవనని తెలిసే ఇంటికి వెళ్లి మరి పవన్ కళ్యాణ్ కాళ్లు పట్టుకున్నాడు. మతతత్వ పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకుని తప్పు చేసానని ఎంతో బాధపడిన చంద్రబాబు..... అమిత్ షా డిమాండ్లకు తలొగ్గి తిరిగి పొత్తు పెట్టుకున్నాడని అన్నారు.వాలంటీర్లపై చంద్రబాబు యూటర్న్ అంతా దొంగ నాటకాలు. వాలంటీర్ల పేరు చెబితే చంద్రబాబు ఉలిక్కి పడుతున్నాడు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి....ప్రజలకు మధ్య వారదులుగా బ్రహ్మాండంగా పనిచేసిన వ్యవస్థ వాలంటీర్లు. వాలంటరీ వ్యవస్థను ఎన్నికల్లో ఉపయోగించుకోవాల్సిన అవసరం మాకు లేదు. చదువుకునీ ఎక్కువ యువతరం ఉన్న వాలంటీర్లకు ఏది మంచో తెలుసు, అదే వాళ్లు ప్రజలకు చెబుతారని అన్నారు ఐదేళ్ళుగా ప్రజల ప్రతి అవసరాలు తీరుస్తు సేవలు అందిస్తున్న వాలంటీర్లపై చంద్రబాబు, పవన్ నోటికొచ్చినట్లు అవమానకరంగా మాట్లాడారు. ఇప్పుడు యూటర్న్ తీసుకొని వాలంటీర్ల జీతాలు పెంచుతామని చంద్రబాబు అంటున్నాడు. ×చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలు.... జన్మభూమి కమిటీలను తిరిగి ఏర్పాటుచేసి.... కార్యకర్తలను పెట్టుకొని వారికి ఇస్తాడు జీతాలు. ఇప్పుడున్న వారందరిని ఇంటికి పంపి..... తెలుగుదేశం కార్యకర్తలతో చంద్రబాబు కలెక్షన్లు వసూలు చేస్తాడని అన్నారు.

## రాంకొండలో షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి వాము దగ్ధం

**రైతుకు దాదాపు లక్ష రూపాయల నష్టం**



**తుగ్గలి** తుగ్గలి మండలం పరిధిలోని గల రాంకొండ గ్రామంలో ఉన్న లంకాయపల్లె పెద్ద రంగా రెడ్డి పొలంలో వేరుశనగ వాముకు పొలంలో వెళ్లిన హై ఓల్టేజ్ విద్యుత్ తీగల లైన్ ఉంది.కరెంట్ తీగల కింద కొంత దూరాన ఉన్న గడ్డి వాము ఉండడంతో తీగలపై వాలిన పక్షులకు షార్ట్ సర్క్యూట్ అవ్వడం వలన నిప్పులు చెలరేగి మంటలు గడ్డి వాముపై పడి మంటలు ఎగసిపడి వాము మొత్తం పూర్తిగా కాలి పోవడంతో రైతు పెద్ద రంగా రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.ఘటన జరిగిన పొలంలోకి చుట్టూ ప్రక్కల గ్రామాలలోని ప్రజలు హుటాహుటిన చేరి మంటల్లో కాలి పోతున్న గడ్డి వామును ఆర్పడానికి పత్తికొండ అగ్నిమాపక కేంద్రం బృందంతో కలిసి ఎంత ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోవడంతో సుమారు 80 వేల రూపాయల నుంచి లక్ష రూపాయల దాకా నష్టం వాటిల్లిందని తెలియజేశారు.స్థానిక గ్రామ ప్రజలు మాట్లాడుతూ నష్టపోయిన రైతుకు ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు తెలియజేశారు.

# రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చెయ్యడమే మన లక్ష్యం

**- బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి.**



**బయ్యారం** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం బయ్యారం మండలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలనీ. రాష్ట్రంలో మాదిరిగానే కేంద్రములో ప్రజలు మార్పుకోరుకుంటున్నారు. 2022 వరకు దేశములో ఉన్న పేదలందరికీ ఇల్లు కట్టిస్తామని గత ఎన్నికల్లో బిజెపి చెప్పు మాట తప్పింది.ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఎక్కడ ఇల్లు కట్టిచ్చారో భాజపా నేతలుచెప్పాలి.బిజెపి, బిఆర్ఎస్ లకు ఓటు అడిగే హక్కు లేదు,అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీ లు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ కి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి దక్కింది అన్నారు.

కేంద్రమంత్రిగా బలరామ్ నాయక్ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు,గతం లో గెలిచిన సీతారామ్ నాయక్, కవిత, నియోజకవర్గానికి చేసింది శూన్యం అన్నారు. కేంద్రియ విద్యాలయం తెచ్చి పేదవిద్యార్థులకు పెద్ద దిక్కు అయ్యారు, మోడల్ స్కూల్స్, ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నో రోడ్లు, బ్రిడ్జ్ లు కట్టిన ఘనత బాలరామ్ నాయక్ కి దక్కింది అన్నారు.బీఆర్ఎస్ 10 ఏండ్ల పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేశారు,మహిళలనుకోటీశ్వరులను చేయాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం,మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు 10 లక్షల జీవిత భీమా,రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాజీ కేంద్ర మంత్రి వర్యులు పోరిక బలరాం నాయక్ నీ భారీ మెజార్టీ తో గెలిపించాలని బలరాం నాయక్ ఎంపీ గా ఉంటే మరింత అభివృద్ధిచేసుకోవచ్చు అని అన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి హాజరైనఎమ్మెల్యే



**రామడుగు** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతి అలివేలు మంగ కళ్యాణ మహోత్సవం శ్రీ శ్రీ శ్రీ శ్రీ హరి మౌన స్వామి రోటి గూడెం వారి ఆధ్వర్యంలో 24వ తేదీన ప్రారంభమై 27వ తేదీ బుధవారం రోజున ఉదయం వెయ్యి మంది స్త్రీమూర్తులచే కుంకుమ పూజా నిర్వహించారు. అనంతరం12-42 నిమిషములకు చిత్త నక్షత్ర మిధున లగ్న పుష్కరాంశ సుమూర్తమున శ్రీ అలువేలుమంగ పద్మావతి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేద పండితులచే అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరైమొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. స్వామివారి కళ్యాణం తిలకించిన భక్తులందరికీఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నార్ల రమేష్ ఆలయ ప్రధాన అర్చకులు డింగిరి సత్యనారాయణ చార్యులు కిరణ్ చార్యులు రమణాచార్యులు దొనపాటి సీతారాం రెడ్డిముదిగంటి సత్యనారాయణ రెడ్డి ముదిగంటి రాజిరెడ్డి ధర్మకర్తలు ఉత్సవ కమిటీ సభ్యులు భక్త భజన మండలి సభ్యులు గ్రామ ప్రజలు మహిళలు వివిధ గ్రామాల ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల 44 వ వార్షికోత్సవం

**భీమవరం** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల 44 వ వార్షికోత్సవం ఘ నంగా జరిగింది. ముఖ్యఅతిథిగా మిజోరం రాష్ట్ర గవ ర్నరు కంభంపాటి హరిబాబు పాల్గొన్నా రు. కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాద్ రాజు అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి దీటుగా ఎంతో అభివృద్ధి సాధించిందని సమాచార విప్లవం కూడా దేశంలో వచ్చిందని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో భవిష్యత్తులో కూడా ఇతర దేశాల పై ఆధారపడకుండా చదువుతోపాటు ఏదో ఒక దాంట్లో నైపుణ్యం సంపాదిం చి విద్యార్థులు బయటికి రావాలని సూచన చేశారు. డి ఆర్ డి ఏ వంటి సంస్థల్లో జరుగుతున్న పరిశోధన లు కూడా విద్యార్థులు పరిశీలించి వాటి నుంచి తాము కూడా భవిష్యత్తులో ఆ రంగంలో నైపుణ్యం సాధించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు.

## చింతమనేని ప్రభాకర్ కాన్వాయ్‌లో తనిఖీలు

**దెందులూరు** ఏలూరు జిల్లా పెదపాడు మండలం లోని జాతీయ రహదారిపై ఉన్న కల పర్రు టోల్ గేట్ వద్ద దెందులూరు నియోజకవర్గ ఎన్డీయే కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ కాన్వాయ్ లో బుధవారం ఉదయం పోలీసులు తని ఖీలు చేపట్టారు. అప్పన్నవీడు, హను మాన్ జంక్షన్లలో జరిగిన పలు కార్యక్ర మాల్లో పాల్గొనీ దెందులూరు వస్తున్న చింతమనేని ప్రభాకర్ కాన్వాయ్ ని టోల్ ప్లాజా వద్ద ఆపిన పోలీసులు క్షుణ్ణంగా తనికీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా చింత మనేని ప్రభాకర్ వారి విధులకు పూర్తిగా సహకరించారు. కాన్వాయ్ లో ఎటువంటి అభ్యంతరకర సామగ్రి లేదని ధ్రువీకరించిన అనంతరం పోలీసులు చింతమనేని కాన్వాయ్ నీ ముందుకు అనుమతించారు.

## దానంతో మేయర్ విజయలక్ష్మీ భేటీ

**హైదరాబాద్** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తో జీహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి భేటీ అయ్యారు. దానం నాగేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ లో ప్రజా ప్రతినిధులకు విలువ లేదు. అందుకే అందరూ బీఆర్ఎస్ ను వీడుతున్నారు .చ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో పాటు కేకే కూడా కాంగ్రెస్ లోకి వస్తున్నారు. తనను అనర్హుడి గా ప్రకటించాలని కేటీఆర్ సుప్రీం కోర్ట్ కు వెళ్తా అంటున్నారు. నేను వాళ్ళ పార్టీ సింబల్ మీద గెలిచా... వారు సుప్రీం కోర్టు కైనా వెళ్ళవచ్చు. తప్పు లేదు. తాను జూన్ లో ఎంపీ గా గెలిచాక నేనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.జీహెచ్ఎంసి మేయర్ కు కూడా బీఆర్ఎస్ లో విలువ లేదు. కనీసం ప్రోటో కాల్ పాటించలేదు. సికింద్రాబాద్ లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తానని అన్నారు.

# తెలంగాణలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల గోల్ మాల్

## - అరెస్టులపై హరీష్ ఆఫీస్ వివరణ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మరో కేసు సంచలనంగా మారుబోతోంది. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్స్‌లో గోల్‌మాల్ జరిగిందని కేసు రిజిస్టర్ అయింది. ఇందులో మాజీ మంత్రి హరీష్‌రావు వ్యక్తిగత సిబ్బంది అరెస్టు కావడం కేసులో కీలకంగా మారుతోంది. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు నలుగుర్ని అరెస్టు చేశారు. వారిలో హరీష్‌రావు పీఏ నరేష్ ఉన్నాడు. జరుగుతున్న ప్రచారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కార్యాలయం స్పందించింది. "హరీష్ రావు పీఏ సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాజేసిందు అనే వార్తతో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నాం. వాస్తవం ఏమిటంటే నరేష్ అనే వ్యక్తి హరీశ్ రావు వద్ద పీఏ కాదు. అతను ఒక కంప్యూటర్ ఆపరేటర్‌గా, తాత్కాలిక ఉద్యోగిగా హరీశ్ రావు కార్యాలయంలో పని చేసే వారు. ఆర్థిక, ఆరోగ్య మంత్రిగా పదవీకాలం పూర్తైన తర్వాత, ప్రభుత్వ ఆదేశాలు లేఖ నం. 2290 తేదీ 05-12-2023 ఆదేశాల ప్రకారం, ఆ ఆఫీస్‌ను తర్వాత రోజు 06-12-2023 రోజున మూసివేసి, సిబ్బందిని పంపేశాం. ఆ రోజు నుంచి నరేష్ అనే వ్యక్తితో హరీశ్ రావు కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు. అయితే ఆఫీసు మూసివేసే క్రమంలో ఎలాంటి సమాచారం లేకుండా కొన్ని సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన వెంట తీసుకువెళ్లినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై వెంటనే మా కార్యాలయం స్పందించి, నరేష్ అనే వ్యక్తిపై 17-12-2023 నాడు, నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. చట్ట ప్రకారం, తగు చర్యలు తీసుకోవాలని కోరాం. కాబట్టి, ఆ వ్యక్తితో హరీశ్ రావుకి గానీ, కార్యాలయానికి గాని ఎలాంటి సంబంధం లేదు. ఈ వాస్తవాలు గుర్తించకుండా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పును, మొత్తం కార్యాలయానికి వర్తింపచేయడం బాధాకరం. ఎంతో మంది అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మా కార్యాలయం సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాకుండా, ఎన్నో విధాలుగా సహాయంపడింది. ఈ విషయం అందరికి తెలిసిందే. వాస్తవాలు గుర్తించాలని కోరుతున్నాం." అంటూ ప్రకటన రిలీజ్ చేశారు

# తిరుమల శ్రీవారికి రాజకీయ రంగు ఎందుకు.?

- టీటీడీలో ఎలక్షన్ కోడ్ అమలు ఎందుకు.?
- మసీదులు, చర్చిలకు ఎన్నికల కోడ్ వర్తించదా. ?
- పాలకమండలి, ఎన్నికల సంఘం పై మండిపడుతున్న భక్తులు



**తిరుమల ( ప్రశ్న న్యూస్)** తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎన్నికల సంఘం ఎలక్షన్ కోడ్ అమలు చేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ లేని విధంగా , ఏ మతానికి లేని విధంగా ఒక్క హిందూ సంప్రదాయం , హిందూ దేవుళ్లకు మాత్రమే ఎన్నికల కోడ్ ఎందుకు వర్తింపజేస్తున్నరని శ్రీవారి భక్త కోటి మండిపడుతున్నారు.ఇప్పటికైనా మసీదు, చర్చి వలే హిందూ దేవాలయాలు రాజకీయానికి దూరంగా ఉండేలా ఎన్నికల సంఘం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున భక్తుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# నార్కోటిక్ డ్రగ్స్ మాఫియాను నిర్మూలించడంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపాలి

- ప్రజా సంక్షేమం కోసం తక్కువ సమయంలో డ్రగ్ మాఫియా ను అరికట్టాలి
- తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేసేందుకు తీవ్ర కృషి చేయాలి
- డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి
- మందులను కూడా మత్తుకు వినియోగిస్తున్న యువత
- దీనికి కారణం ఎవరు.? మత్తు మందులను ఎలా ఎక్కడ లభిస్తున్నాయి
- దగ్గు, నొప్పి నివాణ, డిప్రెషన్, మానసిక రుగ్మతలకు ఉపయోగించే కొన్ని రకాల మాత్రలు, ఇంజెక్షన్లు వైద్యుడి ప్రిస్క్రిప్షన్ మేరకు మెడికల్ షాప్స్ లో పేషంట్స్ కు ఇవ్వాలి
- డ్రగ్స్ నిర్మూలనలో 100% సాధ్యం కావాలంటే ఏమి చెయ్యాలి.?
- ప్రముఖ పాత్ర వహించేది ఎవరు.?
- వారు ఎంత వరకు న్యాయం చేస్తున్నారు.?
- చట్టాల పాత్ర ఏంటి.? వాటి అమలు ఏ విధంగా ఉంది.?
- డ్రగ్స్ నిర్మూలన ప్రభుత్వానికి ఖర్చు తో కూడుకున్నదా.?
- ఇప్పుడు తనికీలు ఏ విధంగా జరుగుతున్నాయి.? దాని ప్రభావం ఎలా ఉంది.?
- ఇంకా తనికీలు ఎలా జరిగితే బాగుంటుంది.?





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నార్కోటిక్ డ్రగ్స్ మాఫియాను నిర్మూలించడంలో అధికారులు మరింత కృషి చేయాలని ఆకుల సంజయ్ రెడ్డి పేర్కొన్నారు. ది డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, రూల్స్ 1945లో సెక్షన్ 65(2) ఔషధాలను రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్, వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌పై రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ద్వారా లేదా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో మాత్రమే ప్రజలకు అందించాలన్నారు. సెక్షన్ 65(4) మెడికల్ షాపు యజమాని, ప్రజలకు విక్రయానికి ఉద్దేశించిన ఔషధ కొనుగోలు రికార్డులు, అటువంటి రికార్డులు క్రింది వివరాలను చూపుతాయి, అవి (ఎ) కొనుగోలు తేదీ, (బి) కొనుగోలు చేసిన వ్యక్తి పేరు, చిరునామా, అతని వద్ద ఉన్న సంబంధిత లైసెన్స్ సంఖ్య (సి) ఔషధం పేరు, పరిమాణం మరియు బ్యాచ్ సంఖ్య, (డి) ఔషధ తయారీదారు పేరు. నగదు లేదా క్రెడిట్ మెమోలతో సహా కొనుగోలు బిల్లులు లైసెన్సుదారుచే క్రమానుగతంగా లెక్కించబడతాయి, అతను కాలక్రమానుసారం నిర్వహించాలి. ప్రజలు మెడికల్ షాప్స్ లో మందులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తీసుకోవాలి

**మందుల కొనుగోలు బిల్లు వివరాలు క్రింది విధంగా ఉండాలి..**

(ఎ)కొనుగోలు తేదీ,
(బి) కొనుగోలు చేసిన వ్యక్తి పేరు మరియు చిరునామా, అతని వద్ద ఉన్న సంబంధిత లైసెన్స్ సంఖ్య,
(సి)ఔషధం పేరు, పరిమాణం మరియు బ్యాచ్ సంఖ్య,
(డి) ఔషధ తయారీదారు పేరు.
(ఇ) రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సంతకం రిజిస్ట్రేషన్ నంబరు. సెక్షన్ 65(9) షెడ్యూల్ హెచ్, హెచ్1 లేదా షెడ్యూల్ %శ%లో పేర్కొన్న మందులు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ప్రిస్క్రిప్షన్‌పై రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ద్వారా మాత్రమే ప్రజలకు అందించాలన్నారు.

(దగ్గు, యాంటీయాటిక్స్ , బీ పి, షుగర్ మాత్రలు, నొప్పి నివాణ, డిప్రెషన్, మానసిక రుగ్మతలకు ఉపయోగించే, ఆపరేషన్ సమయంలో మత్తు కోసం ఉపయోగించే ఇంజెక్షన్లు కొన్ని రకాల మాత్రలు) ప్రిస్క్రిప్షన్లు యొక్క జిరాక్స్ కాపీని మెడికల్ షాప్ లైసెన్సుదారు, ఫార్మసిస్ట్ రెండు సంవత్సరాల పాటు భద్రపరచాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల, కళాశాల స్థాయిలో స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ ప్రాజెక్ట్ ని అమలు చేయాలని తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు ఆకుల సంజయ్ రెడ్డి కోరారు.

# ఫోన్ ట్యాపింగ్ నిందితులను వదలం

## - మంత్రి కొండా సురేఖ వెల్లడి



**వరంగల్ (ప్రశ్న న్యూస్)** సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను వదిలిపెట్టబోమని ఆమె అన్నారు. తన భర్త కొండా మురళీ ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని ఆమె వ్యాఖ్యానించారు. సీఎం కూతురుగా ఉన్నప్పుడు లిక్కర్ అక్రమ వ్యాపారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. అవినీతి సొమ్ముతో కేసీఆర్ కుటుంబం కోట్లకు పడగలెత్తిందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం అవినీతిలో బీజేపీకి వాటా ఉందని, మేఘా కృష్ణారెడ్డి బీజేపీకి వెయ్యి కోట్ల రూపాయలను పార్టీ ఫండ్‌గా ఇచ్చారని ఆరోపించారు. అందుకే కాళేశ్వరం అవినీతిపై నోరు మెదపడం లేదని అన్నారు.ఇక మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి మాట్లాడుతూ.. కొత్త-పాత కార్యకర్తలను కలుపుకుని పోతామని అన్నారు. వారంలో ఐదు రోజులు క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటామని ప్రజలు, పార్టీ శ్రేణులకు ఆయన హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో బీజేపీకే మెజార్టీ సీట్లు

## - రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఎంపీ సీట్లను సాధిస్తాం

## - కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్‌రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) :** తెలంగాణలో ఈసారి బీజేపీ మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకోబోతున్నదని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సహా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే బీజేపీ కార్యక్రమాల్లో పాల్గొన్నారని, వారి పర్యటనల సందర్భంగా ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. ఇప్పటికే ఆయా స్థానాల్లో బలమైన అభ్యర్థులను ప్రకటించినట్లు పేర్కొన్న కిషన్ రెడ్డి.. డోర్ టు డోర్ వెళ్లి ప్రజలను కలుస్తున్నామని, రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఎంపీ సీట్లను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అంబర్ పేట్ అసెంబ్లీ సెగ్మెంట్ లోని గోల్నాక డివిజన్ శ్రీనివాస్ టవర్స్ కదిరి భాగ్, శంకర్ నగర్ బస్తిలో పర్యటించారు. అనంతరం సనత్ నగర్, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రామ్ గోపాల్ పేట్, కాబ్రా కాంప్లెక్స్, పాన్ బజార్, రాణిగంజ్, ప్యాట్నీ, కలాసిగూడ, ఓల్డ్ బోయిగూడా, నాలా బజార్, మొండా మార్కెట్ బస్తిల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా లోక్? సభ ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభమైందని కిషన్ రెడ్డి తెలిపారు. "తెలంగాణలో నిర్వహించిన ఐదు బీజేపీ కార్యక్రమాల్లో ప్రధాని మోడీ పాల్గొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పోలింగ్ బూత్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే అభ్యర్థుల పేర్లు ప్రకటించాం. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాం. ప్రధానంగా భారీ బహిరంగ సభల కంటే.. డోర్ టు డోర్ వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడాలని నిర్ణయించాం. రాష్ట్ర స్థాయి నాయకుడు గానీ, జిల్లా స్థాయి నాయకుడు గానీ ప్రతి ఒక్కరూ డోర్ టు డోర్ వెళ్లే కార్యక్రమంలో విధిగా భాగస్వామ్యులయ్యేలా ప్రణాళిక రూపొందించాం. దేశవ్యాప్తంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మోడీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. తెలంగాణలో కూడా.. డబుల్ డిజిట్ పార్లమెంట్ సభ్యులు గెలిచే అవకాశం ఉన్నది. అన్ని ప్రాంతాల్లో కూడా ప్రజలు బీజేపీకి సానుకూలంగా స్పందిస్తున్నారు"అని కిషన్ రెడ్డి తెలిపారు. గతంలో బీఆర్ఎస్ కు, కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలు.. ఈసారి మాత్రం బీజేపీకే ఓటేస్తామని చెబుతున్నారని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. "ఈసారి దేశం కోసం ఓటేస్తాం.., అభివృద్ధికే ఓటేస్తాం, మా పిల్లల భవిష్యత్‌కే ఓటేస్తాం.. అని తెలంగాణల ప్రజలు అంటున్నారు. ప్రజలు మరోసారి మోడీని ప్రధాన మంత్రిగా చూడాలనుకుంటున్నారు. ఆయనను ఆశీర్వదిస్తున్నారు. అందుకే తప్పకుండా బీజేపీ తెలంగాణలో అత్యధిక సీట్లు సాధిస్తుంది. ఈసారి తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్ఎస్ ఆవశ్యకత లేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే. ఇందులో ఏ పార్టీకి ఓటు వేసినా వృథానే అవుతుంది"అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో నీతా అంబానీ పూజలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ భార్య నీతా అంబానీకి ఎంతో అనుబంధం ఉంది. హైదరాబాద్ వచ్చినపుడు తప్పనిసరిగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే నీతా అంబానీ తాజాగా బుధవారం కూడా వెళ్లారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్-ఐపీఎల్ సీజన్ 17 లో భాగంగా బుధవారం రాత్రి ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్- ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ చూసేందుకు వచ్చిన నీతా అంబానీ అందులో భాగంగానే బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని కూడా సందర్శించారు. ఈ క్రమంలోనే బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్న నీతా అంబానీకి ఆలయం అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నీతా అంబానీ బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బల్కంపేట ఆలయంలో నీతా అంబానీ పూజలు చేస్తున్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఇక మ్యాచ్ సమయంలో నీతా అంబానీ బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుంటే విజయం ముంబై ఇండియన్స్‌దేనని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. గతంలో కూడా ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం హైదరాబాద్‌కు వచ్చిన నీతా అంబానీ, బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఇక 2019 ఐపీఎల్ ఫైనల్ సమయంలో మ్యాచ్ మధ్యలో నుంచే వెళ్లి బల్కంపేట ఎల్లమ్మకు నీతా అంబానీ పూజలు చేయడం ఇంకా క్రికెట్ లవర్స్‌కు గుర్తు ఉండే ఉంటుంది. చెన్నై సూపర్ కింగ్స్-ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో చివరికి ముంబై ఒక్క పరుగు తేడాతో ఘన విజయం సాధించింది. ఆ మ్యాచ్ చివర్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొన్న వేళ నీతా అంబానీ మ్యాచ్ చూడకుండా కళ్లు మూసుకుని మంత్రాలు చదువుతూ దండం పెట్టుకున్న ఫోటోలు, వీడియోలు తెగ వైరల్ అయ్యాయి. ఇక నీతా అంబానీ చేసిన పూజలే ముంబై



విజయానికి కారణం అని ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ అప్పట్లో సోషల్ మీడియాలో తెగ కామెంట్లు పెట్టారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588